# జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక



సంపుటి :13 సంచిక :24 సోమవారం 28-9-2026 పేజీలు:8 వెల:3 https://www.epaperjournalistdiary.com/


## ఉగ్రవాదంపై నో కాంప్రమైజ్!

- పాకిస్థాన్ ఉగ్రవాదం కొనసాగిస్తే సైనిక చర్యకైనా సిద్ధం
- జాతీయ భద్రత విషయంలో రాజీ ప్రసక్తే లేదు
- భారత్ శాంతిని కోరుకుంటుంది.. బలహీనతగా భావించొద్దు
- ఇతర దేశాల భూభాగంపై భారత్‌కు కన్ను లేదు
- ఉగ్రవాదానికి ఆశ్రయం ఇచ్చే దేశాలతో చర్చలకు నో
- భారత్‌కు 'థుసిడైడ్స్ ట్రాప్' వర్తించదు
- సుదీర్ఘ నాగరికతకు ప్రతీకగా భారత్ శక్తి
- జాతీయ ప్రయోజనాలు, వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తికి ప్రాధాన్యం
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం




### భారత్‌లో కలపాలంటూ
## పీవోకేలో భారీ నిరసనలు

- 110వ రోజుకు చేరిన పీవోకే ప్రజల ఆందోళనలు
- మందోల్‌లో భారీ నిరసన.. 25 వేల మంది పాల్గొన్నట్లు సమాచారం
- ఎల్‌వోసీకి కేవలం 7 కిలోమీటర్ల దూరంలో నిరసన
- పీవోకేను భారత్‌లోని జమ్మూ కశ్మీర్‌లో కలపాలని డిమాండ్
- ఎల్‌వోసీని రద్దు చేసి రాకపోకలు సాగించాలని నినాదాలు
- రెండు ప్రాంతాల మధ్య రవాణా మార్గం తెరవాలని డిమాండ్
- పాక్ ప్రభుత్వం రేషన్ కూడా ఇవ్వడం లేదని అమన్ ఖాన్ ఆరోపణ
- పాక్ ప్రభుత్వ వేధింపులకు వ్యతిరేకంగా ఉద్యమం
- పీవోకేను ప్రత్యేక దేశంగా గుర్తించాలని పాక్‌కు డిమాండ్
- ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆందోళనకారుల ప్రకటన




# నేడు ఢిల్లీకి సీఎం రేవంత్

### సీఎంగా బాధ్యతలు చేపట్టాక 78వ ఢిల్లీ పర్యటన



- రెండు రోజులపాటు ఢిల్లీలోనే సీఎం
- మీడియా సంస్థ కార్యక్రమానికి హాజరు
- కాంగ్రెస్ ముఖ్య నేతలతో రేవంత్ భేటీ
- మంగళవారం ఏఐసీసీ సమావేశానికి హాజరు
- సమావేశం అనంతరం హైదరాబాద్‌కు తిరుగు పయనం
- ఆలస్యమైతే బుధవారం ఉదయం నగరానికి రాక
- బుధవారం సిరిసిల్లలో సీఎం పర్యటన

హైదరాబాద్,
ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సోమవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన ఢిల్లీకి వెళ్లడం ఇది 78వసారి. రెండు రోజులపాటు ఢిల్లీలోనే ఉండనున్న సీఎం.. ఈ పర్యటనలో పలు కార్యక్రమాల్లో పాల్గొనడంతోపాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నేతలతో సమావేశం కానున్నారు. రాష్ట్రానికి సంబంధించిన అంశాలతోపాటు పార్టీ వ్యవహారాలు, తాజా రాజకీయ పరిణామాలపై పార్టీ ముఖ్యులతో చర్చించే అవకాశం ఉంది. సోమవారం ఢిల్లీ చేరుకున్న అనంతరం రేవంత్‌రెడ్డి ఓ మీడియా సంస్థ నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ కార్యక్రమం అనంతరం కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులతో

-మిగతా 2 లో




### 30 రోజుల వ్యాలిడిటీతో
## రీఛార్జ్ ప్లాన్స్!

- 28 రోజుల ప్లాన్‌ల స్థానంలో 30 రోజుల వ్యాలిడిటీ
- అందుబాటులో వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్ ప్లాన్స్ సైతం
- 12 సార్లు రీఛార్జ్ చేస్తే ఏడాది పాటు సేవలు
- డేటా అవసరం లేని వారికి ప్రత్యేక రీఛార్జ్‌లు
- రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా వెల్లడి




## దక్షిణాఫ్రికాలో సామూహిక కాల్పులు..



### సర్'కు తొలి పరీక్ష
## ఖైరతాబాద్!

- ఉప ఎన్నికకు రంగం సిద్ధం
- ఓటర్ల జాబితాలో భారీ మార్పులు
- 1.23 లక్షల పేర్లు తొలగింపు
- 81,404 మందికి నోటీసులు
- తుది ఓటర్ల జాబితాపై ఉత్కంఠ

హైదరాబాద్,
రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియ తొలి పరీక్షకు సిద్ధమవుతున్నది. 'సర్' ముగిసిన తర్వాత జరుగబోయే తొలి ఎన్నికలుగా ఖైరతాబాద్ బైపోల్ ప్రాధాన్యం సంతరించుకున్నది. దానం నాగేందర్ అనర్హతకు సంబంధించిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి ఉపఎన్నిక అనివార్యమైంది. నిబంధనల ప్రకారం ఖాళీ అయిన అసెంబ్లీ స్థానానికి ఆరు నెలల్లోగా ఉపఎన్నిక నిర్వహించాల్సి ఉంటుంది. ఈలోగా 'సర్' ప్రక్రియ కూడా పూర్తికానున్నది. అయితే, ప్రస్తుతం 'సర్' ప్రక్రియలో ఓటర్ల జాబితాలో భారీగా మార్పులు చోటుచేసుకోవడం ఉపఎన్నికపై ఆసక్తిని మరింత పెంచుతున్నది. సర్' ప్రక్రియ ప్రారంభానికి

-మిగతా 2 లో



## తెలంగాణలో మళ్లీ ఎండలు

- వారం రోజుల వర్షాలకు బ్రేక్.. ఇక పొడి వాతావరణం
- నేటి నుంచి పెరగనున్న ఉష్ణోగ్రతలు
- చాలా ప్రాంతాల్లో 34--35 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు
- ఉదయం వేళల్లో మాత్రం చల్లటి వాతావరణం
- సెప్టెంబర్ 29న దక్షిణ తెలంగాణలో అక్కడక్కడా వర్షాలు
- కర్ణాటక సరిహద్దు జిల్లాల్లో ఉరుములతో కూడిన వానలు
- అక్టోబర్ 2 వరకు మిగతా ప్రాంతాల్లో పొడి వాతావరణం
- ఆ తర్వాత ఆగ్నేయ తెలంగాణలో తేలికపాటి వర్షాలకు అవకాశం

తెలంగాణలో వాతావరణం మరోసారి మారనుంది. వారం రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురిసిన నేపథ్యంలో.. నేటి నుంచి వర్షాలు తగ్గి ఎండలు పెరిగే అవకాశం ఉందని వెదర్‌మ్యాన్ బాలాజీ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆకాశం నిర్మలంగా ఉండటంతో పాటు పొడి గాలులు వీచే అవకాశం ఉందన్నారు. దీంతో పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరగనున్నాయని పేర్కొన్నారు. నేటి నుంచి చాలా ప్రాంతాల్లో 34 నుంచి 35 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. అయితే ఉదయం వేళల్లో మాత్రం వాతావరణం చల్లగా ఉంటుందని చెప్పారు. సెప్టెంబర్ 29న కర్ణాటక సరిహద్దులోని దక్షిణ తెలంగాణ ప్రాంతాల్లో అక్కడక్కడా ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మిగతా తెలంగాణ ప్రాంతాల్లో అక్టోబర్ 2 వరకు వాతావరణం పొడిగానే ఉండే అవకాశం ఉందని బాలాజీ పేర్కొన్నారు. ఆ తర్వాత గాలుల దిశలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని తెలిపారు. దీంతో ఆగ్నేయ తెలంగాణలో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు సమీపంలోని జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు.

-మిగతా 2 లో

## మరోసారి నేపాల్‌లో ప్రకృతి విలయం




- హిమ్‌లుంగ్ హిమాల్ బేస్‌క్యాంప్‌పై విరిగిపడిన మంచుకొండ
- ప్రమాదంలో పలువురు పర్వతారోహకులు, సహాయక సిబ్బంది గల్లంతు
- 10 మంది ఆచూకీ లభించలేదన్న అధికారులు
- టిబెట్ సరిహద్దుల్లోని మనాంగ్ జిల్లాలో ఘటన
- భారీ మంచు, వర్షాలతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం
- హెలికాప్టర్ల రాకపోకలపై ప్రత్యేక అనుమతుల నిబంధన
- గల్లంతైన వారి కోసం రెస్క్యూ బృందాల ముమ్మర గాలింపు
- వర్షాలు, హిమపాతంతో నేపాల్‌లో ప్రతికూల వాతావరణం
- రహదారులు దెబ్బతిని పలు ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం
- వాతావరణం శాంతించే వరకు పర్వతారోహణ కార్యకలాపాలు నిలిపివేత

# పల్లె పండుగ 3.0

### ఈ నెల 29న 'రామాపురం'లో చంద్రబాబు, పవన్ పర్యటన

- ఈ నెల 29న 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం ప్రారంభం
- నెల్లూరు జిల్లా రామాపురంలో సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్ పర్యటన
- గ్రామాల అభివృద్ధి కోసం రూ.10 వేల కోట్ల నిధులు కేటాయింపు
- పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే
- సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పిలుపు

నెల్లూరు, అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపడుతున్న 'పల్లె పండుగ 3.0' కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. ఈ నెల 29న నెల్లూరు జిల్లా, ఉదయగిరి నియోజకవర్గం లోని రామాపురంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. వీరి పర్యటనతో రామాపురంలో సందడి వాతావరణం నెలకొంది. పల్లెల రూపురేఖలను సమూలంగా మార్చాలనే సంకల్పంతో.... రాష్ట్రంలోని పల్లెల రూపురేఖలను సమూలంగా మార్చాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. దీని కోసం



రాష్ట్రవ్యాప్తంగా రూ.10,000 కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడం, పారిశుధ్యం మెరుగుపరచడం, తాగునీటి సౌకర్యం, రహదారుల నిర్మాణం వంటి కీలక పనులను చేపట్టనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా పంచాయతీ గ్రాంట్లు, గ్రామీణాభివృద్ధి పథకాలకు పెద్దపీట వేయనున్నట్లు తెలుస్తోంది.

-మిగతా 2 లో




## విజయవాడలో 'సచివాలయ ఉద్యోగుల' 'ఆందోళన'తో తీవ్ర ఉద్రిక్తత

- విజయవాడలో సచివాలయ ఉద్యోగుల ఆందోళన..
- ధర్నా చౌక్‌కు వెళ్లకుండా ఉద్యోగులను అడ్డుకున్న పోలీసులు
- పలువురి అరెస్ట్
- స్పందించిన మంత్రి డోలా
- ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి డీబీవీ స్వామి హామీ
- రాజకీయ లబ్ది కోసమే కొందరు ఉద్యోగులను రెచ్చగొడుతున్నారని ఆరోపణ
- లిఖితపూర్వక హామీ ఇచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని ఉద్యోగుల స్పష్టీకరణ




### ఏపీ 'డిజిటల్ కార్పొరేషన్'కు జాతీయ స్థాయిలో 'గోల్డ్ అవార్డు' రావడంపై అభినందించిన చంద్రబాబు

- రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖకు సిల్వర్ పురస్కారం
- రెండు విభాగాల అధికారులను ప్రత్యేకంగా అభినందించిన సీఎం చంద్రబాబు
- డిజిటల్ పాలనలో ఏపీ ప్రగతికి ఇది నిదర్శనమని వ్యాఖ్య
- అమరావతి క్వాంటమ్ వ్యాలీ ప్రచారానికి దక్కిన ప్రతిష్ఠాత్మక గుర్తింపు

# భారత్‌లో కలపాలంటూ పీవోకేలో భారీ నిరసనలు

**110వ రోజుకు చేరిన పీవోకే ప్రజల ఆందోళనలు**
**మందోల్‌లో భారీ నిరసన.. 25 వేల మంది పాల్గొన్నట్లు సమాచారం**
**ఎల్‌వోసీకి కేవలం 7 కిలోమీటర్ల దూరంలో నిరసన**
**పీవోకేను భారత్‌లోని జమ్మూ కశ్మీర్‌లో కలపాలని డిమాండ్**
**ఎల్‌వోసీని రద్దు చేసి రాకపోకలు సాగించాలని నినాదాలు**
**రెండు ప్రాంతాల మధ్య రవాణా మార్గం తెరవాలని డిమాండ్**
**పాక్ ప్రభుత్వం రేషన్ కూడా ఇవ్వడం లేదని అమన్ ఖాన్ ఆరోపణ**
**పాక్ ప్రభుత్వ వేధింపులకు వ్యతిరేకంగా ఉద్యమం**
**పీవోకేను ప్రత్యేక దేశంగా గుర్తించాలని పాక్‌కు డిమాండ్**
**ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆందోళనకారుల ప్రకటన**

న్యూఢిల్లీ



పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీవోకే)లో కొంతకాలంగా ఆందోళనలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. తమను భారత్‌లో కలపాలంటూ పీవోకేలో స్థానిక ప్రజలు అవామీ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తున్నారు. గత జూన్ 9న ప్రారంభమైన నిరసనలు శనివారం 110వ రోజుకు చేరాయి. పాక్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్‌ను ఇండియాలోని జమ్మూ కాశ్మీర్‌లో కలపాలని అక్కడి వారు డిమాండ్ చేస్తున్నారు. పీవోకేలోని మందోల్ గ్రామంలో శనివారం భారీ నిరసన ప్రదర్శన జరిగింది.ఈ ఆందోళనల్లో 25,000 మంది పాల్గొన్నారు. ఈ ఆందోళనలు జరిగిన ప్రాంతం లైన్ ఆఫ్ కంట్రోల్ (ఎల్‌వోసీ)కి ఏడు కిలోమీటర్ల దూరంలోనే ఉంటుంది. అంటే, ఇండియా సరిహద్దుకు ఏడు కిలోమీటర్ల దూరంలోనే. ఈ నిరసనపై అవామీ యాక్షన్ కమిటీ నేత సర్దార్ అమన్ ఖాన్ స్పందించారు. మూడు నెలలుగా పాక్ ప్రభుత్వం తమను వేధిస్తోందన్నారు. కనీసం ప్రభుత్వం రేషన్ కూడా సరఫరా చేయడం లేదని ఆరోపించారు. పీవోకేకు, జమ్మూ కాశ్మీర్‌కు మధ్యలో ఉన్న ఎల్‌వోసీని రద్దు చేయాలా అని అక్కడ ఆందోళన చేస్తున్నవారిని ఆయన ప్రశ్నించారు. దీంతో ఆందోళనలో పాల్గొన్న వారంతా రద్దు చేయాలని నినదించారు. రెండు ప్రాంతాల మధ్య నియంత్రణ రేఖను తొలగించాలని, ఇండియాలో పీవోకేను కలపాలని డిమాండ్ చేస్తున్నారు. రెండు ప్రాంతాల మధ్య రవాణా మార్గాన్ని తెరవాలని కూడా వారు కోరుతున్నారు. ఇందుకోసం మరింతగా ఉద్యమించేందుకు సిద్ధమని ప్రకటించారు. పాక్ ప్రభుత్వం తమతో ఏదైనా ఒప్పందం చేసుకోవాలని అనుకుంటే తమను ప్రత్యేక దేశంగా గుర్తించాలని సర్దార్ ఖాన్ సూచించారు. పాక్ ఆర్మీ ఈ ప్రాంతాన్ని తమ దేశ భూభాగంగా చెప్పుకొంటుంది. అయితే, తమను బానిసల్లా చూస్తున్నారని ఖాన్ విమర్శించారు. తమను పాక్ ప్రభుత్వం దశాబ్దాలుగా దోచుకుంటూ, అణచివేతకు గురి చేస్తోందని ఆరోపించారు. పీవోకేలో జరుగుతున్న ఆందోళనల్ని పాక్ ప్రభుత్వం దారుణంగా అణచివేస్తోంది.

# 30 రోజుల వ్యాలిడిటీతో రీఛార్జ్ ప్లాన్స్!

**-28 రోజుల ప్లాన్‌ల స్థానంలో 30 రోజుల వ్యాలిడిటీ**
**-అందుబాటులో వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్ ప్లాన్స్ సైతం**
**-12 సార్లు రీఛార్జ్ చేస్తే ఏడాది పాటు సేవలు**
**-డేటా అవసరం లేని వారికి ప్రత్యేక రీఛార్జ్‌లు**
**-రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా వెల్లడి**

న్యూఢిల్లీ




ప్రీపెయిడ్ మొబైల్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ఇకపై 30 రోజుల వ్యాలిడిటీతో కూడిన రీఛార్జ్ ప్లాన్స్ అందుబాటులోకి రానున్నాయి. దీంతో ఏడాదికి 13 నెలవారీ రీఛార్జ్‌లు చేసుకోవాల్సిన పరిస్థితికి బదులు 12 రీఛార్జ్‌లతోనే ఏడాది సేవలను కొనసాగించుకునే అవకాశం కలగనుంది.

ఈ మేరకు టెలికాం కన్స్యూమర్ ప్రొటెక్షన్ (13వ సవరణ) రెగ్యులేషన్స్-2026ను తీసుకొచ్చినట్లు రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా తెలిపారు. కొత్త నిబంధనలతో వినియోగదారులకు మరిన్ని రీఛార్జ్ ఆప్షన్లు అందుబాటులోకి వస్తాయని రాఘవ్ చద్దా పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న పరిమితమైన, సౌకర్యవంతంగా లేని రీఛార్జ్ ఆప్షన్లపై పలువురు వినియోగదారులు తనకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ సమస్యను మార్చి 11న పార్లమెంట్‌లో ప్రస్తావించి, వినియోగదారులకు మరిన్ని ఎంపికలతో పాటు అందుబాటు ధరల్లో రీఛార్జ్ ప్లాన్స్ కల్పించాలని కోరినట్లు చెప్పారు.

డేటా అవసరం లేని వినియోగదారుల కోసం కేవలం వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్ సేవలతో కూడిన ప్లాన్స్ సైతం అందుబాటులోకి రానున్నట్టు పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రాథమిక అవసరాల కోసం మొబైల్ ఫోన్ ఉపయోగించే తక్కువ బడ్జెట్ వినియోగదారులకు ఈ ప్లాన్స్ ఉపయోగకరంగా ఉండనున్నట్టు చెప్పారు.

అవసరానికి అనుగుణంగా ప్లాన్స్ ఎంచుకునే అవకాశం వినియోగదారులకు లభించనుందని, కొత్త నిబంధనలతో ప్రీపెయిడ్ వినియోగదారులు రీఛార్జ్ విషయంలో మరింత వెసులుబాటు కలిగించినట్లు అవుతుందని రాఘవ్ చద్దా వెల్లడించారు.

# ఉగ్రవాదంపై నో కాంప్రమైజ్!

న్యూఢిల్లీ



ఉగ్రవాదం విషయంలో భారత్ ఎలాంటి రాజీకి తావివ్వదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని కొనసాగిస్తే ఎలాంటి సైనిక చర్యకైనా భారత్ పూర్తిగా సిద్ధంగా ఉందని తేల్చి చెప్పారు. ఎన్డీటీవీ డిఫెన్స్ కాన్క్లేవ్‌లో మాట్లాడిన ఆయన.. భారత్ శాంతిని కోరుకుంటుందని, ఇతర దేశాల భూభాగాన్ని ఆక్రమించాలనే ఉద్దేశం తమకు లేదని పేర్కొన్నారు. అయితే భారత్ శాంతి కోరుకోవడాన్ని బలహీనతగా లేదా పిరికితనంగా భావించరాదని హెచ్చరించారు. జాతీయ భద్రత విషయంలో భారత్ ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోదని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఉగ్రవాదానికి ఆశ్రయం కల్పించే దేశాలతో చర్చలకు కూడా ఆస్కారం లేదని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే విధానాలను అంగీకరించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. దేశ భద్రతకు ముప్పు ఏర్పడితే అవసరమైన చర్యలు తీసుకునేందుకు భారత్ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. ప్రపంచ భౌగోళిక రాజకీయాల్లో భారత్ ఎదుగుదలపై కూడా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడారు. భారత్‌కు 'థుసిడైడ్స్ ట్రాప్' వర్తించదని పేర్కొన్నారు. ఎదుగుతున్న శక్తి, ఆధిపత్య శక్తి మధ్య సంఘర్షణ తప్పదనే భావనను భారత్ విషయంలో అన్వయించలేమని తెలిపారు. భారత్ కేవలం ప్రపంచ శక్తుల మధ్య మార్పును కోరుకునే దేశం కాదని, సుదీర్ఘ నాగరికత, విలువలకు ప్రతీకగా ఉన్న శక్తి అని వివరించారు. విదేశాంగ విధానంలో జాతీయ ప్రయోజనాలకు భారత్ అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని రక్షణ మంత్రి తెలిపారు. అదే సమయంలో వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తిని కొనసాగిస్తూ దేశ ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రపంచ దేశాలతో సంబంధాలను కొనసాగిస్తూనే జాతీయ భద్రత, సార్వభౌమత్వం విషయంలో ఎలాంటి ఒత్తిడికీ తలొగ్గబోమని స్పష్టం చేశారు. భారత్ శాంతిని కోరుకుంటున్నప్పటికీ దేశ భద్రతకు సవాలు ఎదురైతే తగిన విధంగా స్పందించే సామర్థ్యం, సంకల్పం దేశానికి ఉన్నాయని రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో భారత్ వైఖరిలో ఎలాంటి మార్పు ఉండదని ఆయన తేల్చి చెప్పారు.

# నేడు ఢిల్లీకి సీఎం రేవంత్

(మొదటి తరువాయి)




ఆయన భేటీ అవుతారు. ఢిల్లీలో పార్టీ జాతీయ నాయకత్వంతో సీఎం భేటీ కానుండటంతో రాష్ట్ర రాజకీయాలు, ప్రభుత్వ కార్యక్రమాలు, పార్టీ వ్యవహారాలకు సంబంధించిన అంశాలపై చర్చ జరిగే అవకాశం ఉంది. ఇటీవల రాష్ట్రంలో చోటుచేసుకున్న పలు పరిణామాల నేపథ్యంలో పార్టీ పెద్దలతో సీఎం భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులతో సమావేశాలు నిర్వహించడం సాధారణంగా కొనసాగుతోంది. రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై కేంద్రంతో సమన్వయం, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన విషయాలు, పార్టీ పరంగా తీసుకోవాల్సిన నిర్ణయాలపై ఆయన ఎప్పటికప్పుడు జాతీయ నాయకత్వంతో చర్చిస్తున్నారు. తాజాగా చేపట్టనున్న పర్యటనలోనూ పార్టీ ముఖ్యులతో భేటీ కావడం, ఏఐసీసీ సమావేశానికి హాజరు కావడం ప్రధాన కార్యక్రమాలుగా ఉన్నాయి. మంగళవారం ఢిల్లీలో జరిగే ఏఐసీసీ సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ సమావేశంలో పార్టీకి సంబంధించిన పలు అంశాలపై చర్చ జరగనుంది. సమావేశంలో పార్టీ వ్యవహారాలు, భవిష్యత్ కార్యాచరణ, వివిధ రాష్ట్రాల్లో పార్టీ పరిస్థితులు తదితర అంశాలపై చర్చించే అవకాశం ఉంది. సమావేశానికి పార్టీకి చెందిన పలువురు ముఖ్య నేతలు హాజరుకానున్నారు. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి కూడా సమావేశంలో పాల్గొననున్నారు. ఏఐసీసీ సమావేశం పూర్తయిన తర్వాత ముఖ్యమంత్రి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కానున్నారు. సమావేశం నిర్ణీత సమయానికి పూర్తయితే మంగళవారం రాత్రే హైదరాబాద్‌కు చేరుకునే అవకాశం ఉంది. ఒకవేళ సమావేశం ఆలస్యంగా ముగిసినా, ఢిల్లీలో ఇతర కార్యక్రమాలు కొనసాగినా మంగళవారం రాత్రి అక్కడే బస చేసి బుధవారం ఉదయం హైదరాబాద్‌కు వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. సీఎం పర్యటనకు సంబంధించి అధికారిక షెడ్యూల్ మేరకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఇదిలా ఉండగా, ఢిల్లీ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు వచ్చిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం సిరిసిల్లలో పర్యటించనున్నారు. జిల్లాలో నిర్వహించే పలు కార్యక్రమాలకు ఆయన హాజరవుతారు. అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన పలు కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉంది. సిరిసిల్ల పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు చేపడుతున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అవసరమైన ఏర్పాట్లు చేస్తోంది. వరుసగా ఢిల్లీ, హైదరాబాద్, సిరిసిల్ల పర్యటనలతో సీఎం రేవంత్‌రెడ్డి షెడ్యూల్ బిజీగా కొనసాగనుంది. సోమవారం ఢిల్లీకి వెళ్లి మీడియా సంస్థ కార్యక్రమంలో పాల్గొని, కాంగ్రెస్ పార్టీ ముఖ్యులతో భేటీ కానున్నారు. మంగళవారం ఏఐసీసీ సమావేశానికి హాజరై అనంతరం హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. ఆ తర్వాత బుధవారం సిరిసిల్ల పర్యటనలో పాల్గొననున్నారు. ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనలో పార్టీ జాతీయ నాయకత్వంతో జరిగే సమావేశాలు, ఏఐసీసీ భేటీపై కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# సర్'కు తొలి పరీక్ష ఖైరతాబాద్!

(మొదటి తరువాయి)

ముందు ఖైరతాబాద్ నియోజకవర్గంలో 2,93,667 మంది ఓటర్లు ఉన్నారు. అయితే డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదలయ్యే సమయానికి ఈ సంఖ్య 1,70, 195కు తగ్గింది. 'సర్'లో భాగంగా ఎన్యుమరేషన్ ఫామ్‌లు సమర్పించినవారిని మాత్రమే డ్రాఫ్ట్ జాబితాలో చేర్చారు. 1,23,472 మంది పేర్లు తొలగించారు. వీరిని ప్రధానంగా ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్, డబుల్ ఓటు (ఏఎస్‌డీడీ) క్యాటగిరీల కింద గుర్తించారు. తొలగించిన ఓటర్లలో అత్యధికంగా 95,082 మంది ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలిపోయినట్టు ఎన్నికల అధికారులు గుర్తించారు. మరణించినవారు, డూప్లికేట్ ఓట్లు, ఇతర కారణాలతో గైర్హాజరైనవారిని కూడా ఏఎస్‌డీడీ క్యాటగిరీలో చేర్చారు.నగర పర్యటనలను అన్వేషించండి ఈ భారీ తొలగింపుతో ఖైరతాబాద్ నియోజకవర్గ ఓటర్ల సంఖ్యలో గణనీయమైన మార్పు చోటుచేసుకున్నది. అయితే డ్రాఫ్ట్ జాబితా ఆధారంగా తుది ఓటర్ల కూర్పుపై ఇప్పుడే స్పష్టమైన అంచనాకు రావడం సాధ్యం కాదు. 'సర్' ప్రక్రియలో మరో కీలక పరిణామంగా 81,404 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేశారు. 2002 నాటి జాబితాతో లింక్ కాకపోవడం, ఎన్యుమరేషన్ ఫామ్ వివరాల్లో వ్యత్యాసాలు ఉండటం వంటి కారణాలతో ఈ నోటీసులు ఇచ్చారు. నోటీసులకు సంబంధించి ఓటర్లు సమర్పించే వివరణలు, పత్రాలను పరిశీలించిన అనంతరం ఎంతమంది పేర్లు తుదిజాబితాలో తిరిగి చేరుతాయన్నది కీలకంగా మారింది. నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా ప్రచురించనున్న నేపథ్యంలో రాజకీయ పార్టీల దృష్టి ఇప్పుడు ఈ ప్రక్రియపైనే ఉన్నది.

**2023లో 52.34 శాతం పోలింగ్**

2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నియోజకవర్గంలో 2,96,036 మంది ఓటర్లు ఉండగా, 1,53,730 ఓట్లు పోలయ్యాయి. అంటే 52.34 శాతం పోలింగ్ నమోదైంది. ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు 67,368 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి పీ విజయారెడ్డికి 45,358 ఓట్లు లభించాయి. గతంలో ఖైరతాబాద్‌లో 85 వేలకుపైగా బీసీ ఓటర్లు, 75 వేలకుపైగా ముస్లిం ఓటర్లు, 65 వేలకుపైగా ఎస్సీ ఓటర్లు ఉన్నట్టు గణాంకాలు సూచిస్తున్నాయి. ఈ వర్గాలు నియోజకవర్గంలోని ప్రధాన ఓటరు సమూహాలుగా ఉన్నా యి. అయితే 'సర్'లో భారీసంఖ్యలో పేర్లు తొలగించడం, వేలాది మందికి నోటీసులు జారీ చేయడం వల్ల తుది ఓటర్ల జాబితాలో ఈ సామాజికవర్గాల సంఖ్య ఎంతమేరకు మారుతుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. తుదిజాబితా వెలువడిన తర్వాతే కొత్త ఓటర్ల కూర్పుపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నది.

**మారిన రాజకీయ సమీకరణాలు**

ఖైరతాబాద్ ఉపఎన్నిక కేవలం ఖాళీ అయిన స్థానాన్ని భర్తీ చేసే ఎన్నికగా కాకుండా, 'సర్' అనంతరం మారిన ఓటర్ల జాబితాతో జరిగే తొలి రాజకీయ పరీక్షగా మారనున్నది. డ్రాఫ్ట్ జాబితా, తుది జాబితా మధ్య ఎంతమేరకు మార్పులు ఉంటాయి? నోటీసులు అందుకున్నవారిలో ఎంతమంది తిరిగి ఓటర్లుగా నమోదవుతారు? నియోజకవర్గంలోని వివిధ సామాజికవర్గాల ఓటర్ల సంఖ్య ఎలా మారుతుంది? వంటి అంశాలు ఉపఎన్నికలో రాజకీయ పార్టీల వ్యూహాలను ప్రభావితం చేసే అవకాశం ఉన్నది. నవంబర్ 9న వెలువడే తుదిజాబితా ఎన్నికల సమీకరణాలకు కీలక ఆధారంగా మారనున్నది.

# మరోసారి నేపాల్‌లో ప్రకృతి విలయం

ఢాకా:



మొన్నటివరకు వరదలతో అల్లాడిపోయిన నేపాల్‌లో తాజాగా విపత్తు సంభవించింది. ఈ ఉదయం భారీగా హిమపాతం చోటు చేసుకుంది. టిబెట్ సరిహద్దుల్లో ఉన్న మనాంగ్ జిల్లాలోని హిమ్‌లుంగ్ హిమాల్ పర్వతం బేస్ క్యాంప్‌పై భారీగా మంచు కొండ విరిగిపడటంతో పలువురు గల్లంతయ్యారు. వారిలో పర్వతారోహకులు, సహాయక సిబ్బంది ఉన్నారు. 7,126 మీటర్ల ఎత్తులో ఉన్న ఈ పర్వతాల్లో కురుస్తున్న మంచు, వర్షాల కారణంగా సహాయక చర్యలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

ఎక్స్పెడిషన్ ఆపరేటర్స్ అసోసియేషన్ నేపాల్ జనరల్ సెక్రటరీ రిషి భండారీ ఈ విషాద ఘటనను ధృవీకరించారు. ఇప్పటివరకు 10 మంది ఆచూకీ తెలియరాలేదని వెల్లడించారు. పర్వతారోహకులలో ఇద్దరు ఇమాజిన్ నేపాల్ ప్రైవేట్ లిమిటెడ్ కు చెందిన వారు కాగా, మరో ఎనిమిది మంది హిమాలయన్ హాలిడేస్ నేపాల్ సంస్థ ద్వారా ట్రెక్కింగ్ కు వచ్చినట్లు సమాచారం. వారితో పాటు ఇద్దరు సహాయక సిబ్బంది కూడా గల్లంతైన వారిలో ఉన్నారని చెప్పారు.

హిమ్‌లుంగ్ హిమాల్ పర్వత ప్రాంతంలో గాలింపు చర్యలు ముమ్మరం చేయడం రెస్క్యూ బృందాలకు సవాల్ గా మారింది. ఈ ప్రాంతంలో హెలికాప్టర్లను నడపాలంటే ప్రత్యేక అనుమతులు పొందాల్సి ఉంటుంది. ఇది.. అత్యవసర రెస్క్యూ ఆపరేషన్కు అడ్డంకిగా మారింది. నేపాల్ పర్యాటక శాఖ డైరెక్టర్ జనరల్ రామ్ కృష్ణ లామిచానే దీనిపై మాట్లాడారు. రెస్క్యూను తాము పర్యవేక్షిస్తున్నామని, వివిధ ఏజెన్సీలతో సమన్వయం చేసుకుంటూ గల్లంతైన వారిని గుర్తించేందుకు అన్ని ప్రయత్నాలు చేపట్టామని అన్నారు. వాతావరణ మార్పుల కారణంగా నేపాల్ దేశవ్యాప్తంగా ప్రతికూల పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని రోజులుగా కొండ ప్రాంతాల్లో ఎడతెరిపి లేని వర్షాలు, హిమాలయాల్లో భారీ మంచు కురుస్తోంది. ఫలితంగా పలు రహదారులు దెబ్బతిన్నాయి. రాకపోకలు స్తంభించాయి. కిందటి నెలలో రసువా జిల్లాలో సంభవించిన భీకర వరదల్లో దాదాపు 1,400 మందికి పైగా ప్రజలు కోల్పోగా, వందలాది ఇళ్లు కొట్టుకుపోయాయి.

# పల్లె పండుగ 3.0

(మొదటి తరువాయి)

**ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఏర్పాట్లు**

సీఎం, డిప్యూటీ సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. సభా ప్రాంగణం, భద్రతా చర్యలు, పార్కింగ్ సౌకర్యాలను నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేశ్ స్వయంగా పర్యవేక్షించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**ప్రజలందరూ భాగస్వాములు కావాలి**

మరోవైపు, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కూటమి నేతలు సమాయత్తమవుతున్నారు. కోవూరు టీడీపీ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ, ఉదయగిరి నియోజకవర్గంలోని జనసేన, బీజేపీ నాయకులతో సమావేశమై ప్రజా సమీకరణపై చర్చించినట్లు తెలిపారు. "ప్రభుత్వం చేపడుతున్న ఈ మహత్తర కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి. సెప్టెంబరు 29న రామాపురం గ్రామానికి భారీగా తరలివచ్చి 'పల్లె పండుగ 3.0'ను విజయవంతం చేయాలి" అని ఆమె ప్రజలను కోరారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు

# దక్షిణాఫ్రికాలో సామూహిక కాల్పులు..

**కొద్ది గంటల వ్యవధిలో రెండు ప్రాంతాల్లో కాల్పులు**
**జోహన్నెస్‌బర్గ్ సమీపంలో 17 మంది మృతి**
**కేప్‌టౌన్ శివారులో మరో 10 మంది బలి**
**రెండు ఘటనల్లో 26 మందికి గాయాలు**
**బార్ వద్ద కూర్చున్న వారిపై దుండగుల కాల్పులు**
**ఎనిమిది మంది దుండగులు కాల్పులకు తెగబడినట్లు సమాచారం**
**నాలుగు గంటల వ్యవధిలోనే మరో ఘటన**
**కాల్పులకు కారణాలపై కొనసాగుతున్న దర్యాప్తు**



జోహన్నెస్‌బర్గ్/కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాలో కొద్ది గంటల వ్యవధిలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన సామూహిక కాల్పులు తీవ్ర కలకలం రేపాయి. జోహన్నెస్‌బర్గ్, కేప్‌టౌన్ సమీపాల్లో చోటుచేసుకున్న ఈ రెండు ఘటనల్లో మొత్తం 27 మంది ప్రాణాలు కోల్పోగా.. మరో 26 మంది గాయపడ్డారు. కాల్పులకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు.శనివారం రాత్రి జోహన్నెస్‌బర్గ్‌కు సుమారు 80 కిలోమీటర్ల దూరంలోని వెడెలా టౌన్‌షిప్‌లోని ఓ బార్ వద్ద తొలి ఘటన చోటుచేసుకుంది. ఎనిమిది మంది దుండగులు బార్ బయట కూర్చున్న వారితో పాటు లోపల ఉన్నవారిపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 17 మంది మృతి చెందగా.. పలువురు గాయపడ్డారు.ఈ ఘటన జరిగిన నాలుగు గంటలకే కేప్‌టౌన్ శివారులోని లాండ్వేల్ టౌన్‌షిప్‌లో మరో సామూహిక కాల్పుల ఘటన జరిగింది. ఆదివారం తెల్లవారుజామున ఒంటిగంట దాటిన తర్వాత ఓ దుకాణంపై దుండగులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 10 మంది ప్రాణాలు కోల్పోగా.. మరికొందరు గాయపడ్డారు. కొద్ది గంటల వ్యవధిలోనే రెండు ప్రాంతాల్లో సామూహిక కాల్పులు జరగడంతో దక్షిణాఫ్రికాలో భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. రెండు ఘటనలకు సంబంధం ఉందా? కాల్పులకు పాల్పడిన వారి ఉద్దేశం ఏమిటన్న దానిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

# యూపీలో భారీ వర్షాల బీభత్సం..

డైనమిక్ బ్యూరో



ఉత్తరప్రదేశ్‌ను భారీ వర్షాలు వణికిస్తున్నాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు, వాటి కారణంగా చోటుచేసుకున్న ప్రమాదాల్లో రాష్ట్రవ్యాప్తంగా 56 మంది మృతిచెందారు. మరో 46 మంది గాయపడ్డారు. సీతాపూర్ జిల్లాలో అత్యధికంగా ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు పలు జిల్లాల్లో వరద పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలో సాధారణంగా 24 గంటల్లో 1.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతుండగా.. గత 24 గంటల్లో ఏకంగా 45.1 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని మొత్తం 75 జిల్లాల్లో 56 జిల్లాల్లో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైంది. ఫరూఖాబాద్ జిల్లాలో సాధారణం కంటే ఏకంగా 7,385 శాతం అధిక వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. కాన్పూర్, వారణాసి, ప్రయాగ్‌రాజ్, గోరఖ్‌పూర్, బరేలీ తదితర ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. వర్షాల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా వెయ్యికిపైగా ఇళ్లు ధ్వంసమైనట్లు అధికారులు తెలిపారు. పలు ప్రాంతాల్లో జనజీవనం స్తంభించింది. రహదారులపై భారీగా నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మరోవైపు ఘాఘ్రా, రాప్తి నదుల్లో నీటిమట్టం క్రమంగా పెరుగుతోందని సెంట్రల్ వాటర్ కమిషన్ హెచ్చరించింది. నదుల్లో నీటిమట్టం మరింత పెరిగితే లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని అధికారులు అప్రమత్తం చేశారు. దీంతో నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఉన్నావ్ జిల్లాలోని సోనిక్ టోల్‌ప్లాజా వద్ద గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై భారీగా వర్షపు నీరు నిలిచిపోయింది.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# డిండి ప్రాజెక్టు రద్దు చేయాలి అని కదం తొక్కిన ప్రజలు

**పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలతో 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలి**

**- ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం డిమాండ్**

**పాలమూరు రైతాంగానికి జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలి**

**- ప్రొఫెసర్ హరగోపాల్**

**డిండి రద్దు చేయకపోతే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎడారిగా మారుతుంది**

**- కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్**



తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 27 (జర్నలిస్ట్ డైరీ) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతాంగానికి సాగునీటి హక్కు సాధించాలనే డిమాండ్‌తో ప్రజా ఉద్యమం కదం తొక్కింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా పాదయాత్రను ప్రముఖ ప్రజా మేధావి ప్రొఫెసర్ హరగోపాల్ ప్రారంభించారు. ఆదివారం ఉదయం 9 గంటలకు వంగూరు మండలం ఉల్పర గ్రామం నుంచి ప్రారంభమైన పాదయాత్రలో ఉల్పర, ఖానాపూర్, ఎర్రవల్లి తదితర గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని డిండి ప్రాజెక్టును రద్దు చేయాలని నినదించారు. పాలమూరు రైతాంగానికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తూ రైతులు, యువకులు, జేఏసీ నాయకులు పాదయాత్రలో ముందుకు సాగారు. ఉల్పర నుంచి కోనాపూర్ వరకు సాగిన పాదయాత్రకు ప్రజల నుంచి పెద్ద ఎత్తున సంఘీభావం లభించింది.

**పాలమూరుకు ఇచ్చిన హామీ నిలబెట్టాలి: ప్రొఫెసర్ కోదండరాం**

కోనాపూర్‌లో నిర్వహించిన సభలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం పాల్గొని పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పాలమూరు రైతాంగానికి ఇచ్చిన హామీ మేరకు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నీళ్ల విషయంలో అత్యధికంగా అన్యాయం ఎదుర్కొన్న ప్రాంతం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లానేనని కోదండరాం అన్నారు. పాలమూరు రైతాంగానికి సాగునీటి హక్కు కల్పించడంతో పాటు పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

**పాలమూరును ఎడారిగా మార్చే ప్రయత్నాలను సాగనివ్వం: ప్రొఫెసర్ హరగోపాల్**

ప్రజా పాదయాత్రను ప్రారంభించిన ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ పాలమూరు ఉమ్మడి జిల్లాకు జరుగుతున్న అన్యాయంపై ప్రజలు గళం విప్పాల్సిన సమయం వచ్చిందన్నారు. పాలమూరు ఉమ్మడి జిల్లాను ఎడారిగా మార్చేందుకు కొందరు కుట్ర పన్నుతున్నారని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ, అలాంటి ప్రయత్నాలను సాగనివ్వబోమని హెచ్చరించారు. రైతాంగం నీటి కోసం చేస్తున్న పోరాటానికి ప్రజలు, యువత, అన్ని వర్గాలు అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. సాగునీటి హక్కు కోసం ప్రజలంతా ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

**డిండి రద్దు చేయాల్సిందే: జైపాల్ యాదవ్**

కోనాపూర్ సభలో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మాట్లాడుతూ డిండి ప్రాజెక్టును రద్దు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. డిండి ప్రాజెక్టు కొనసాగితే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతాంగంపై తీవ్ర ప్రభావం పడుతుందని, జిల్లా ఎడారిగా మారే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పాలమూరు రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు జరుగుతున్న ఈ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జైపాల్ యాదవ్ పిలుపునిచ్చారు.
ఈ ప్రజా పాదయాత్రలో జిల్లా జేఏసీ, నియోజకవర్గాల జేఏసీ నాయకులు, రైతులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌తో పాటు రాజేందర్ రెడ్డి, రాఘవాచారి, బెక్కెం జనార్దన్, చెన్న కిష్టయ్య, ఖలీల్, అనీఫ్, వీరబ్రహ్మచారి, టీజీ శ్రీనివాస్, రవీంద్రనాథ్, మందారం నరసింహులు, నాగిళ్ల వెంకటేష్, సర్పంచ్ తిరుమలయ్య, టీపీఎఫ్ ప్రభాకర్, అడ్వకేట్ మధుసూదన్, ప్రకాష్ గౌడ్, సదానందం గౌడ్, టీఎల్ఎఫ్ జంగయ్య, స్వామి, వేణుగోపాల్ తదితర జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

# టిఆర్పి ఫరుక్ నగర్ మండల అధ్యక్షుడిగా ఆవ జగన్



రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 27 (జర్నలిస్ట్ డైరీ) : కొడంగల్ గడ్డ పైన జరిగిన బహిరంగ సభలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు ఎమ్మె సంతోష్ గారి ఆధ్వర్యంలో అధ్యక్షులు తీన్మార్ మల్లన్న చేతుల మీదుగా ఫారుక్ నగర్ మండల అధ్యక్షునిగా ఆవ జగన్ కు నియామక పత్రాన్ని అందజేయడం జరిగింది ఈ మహా పాదయాత్రలో షాద్నగర్ నియోజకవర్గం అధ్యక్షులు ఎమ్మె సంతోష్ గారు ఆధ్వర్యంలో షాద్నగర్ నియోజకవర్గం నాయకులు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా టిఆర్పి రాష్ట్ర అధ్యక్షులు తీన్మార్ మల్లన్న గారు మాట్లాడుతూ..
ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలు ఏకమైనప్పుడే రాజ్యాధికారం పొందుతామని ఆ సమయం ఇప్పుడు వచ్చిందని యుద్ధానికి సిద్ధంగా ఉండాలని కుర్చీలో కింద కాలు లాగా కాకుండా కుర్చీ పైన కూర్చోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు ఎమ్మె సంతోష్, ఉపాధ్యక్షులు రాధాకృష్ణ జిల్లా అధికార ప్రతినిధి భూస జంగన్న, కొందుర్గు మండల అధ్యక్షులు దర్గా వెంకటయ్య, చౌదరిగుడా మండల అధ్యక్షులు డి రాములు, కాశ యాదయ్య, జోసెఫ్, సురేష్ మరియు నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

# కప్పపహాడ్‌లో ఘనంగా వినాయక నిమజ్జనం



ఇబ్రహీంపట్నం, ( సెప్టెంబర్ 27) జర్నలిస్ట్ డైరీ. కప్పపహాడ్ గ్రామంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ వెంకటేశ్వర యూత్ ఆధ్వర్యంలో వినాయక నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు నిట్టు జగదీశ్వర్ పాల్గొన్నారు. అనంతరం శ్రీ వెంకటేశ్వర యూత్ ఆధ్వర్యంలో మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ నిట్టు వీరయ్య--సువర్ణ దంపతులు గ్రామ ప్రజలు, భక్తుల కోసం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.
గ్రామాభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని గ్రామ సర్పంచ్ బింగి గీత రాములయ్య, జిల్లా సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు, తుర్కాగూడ సర్పంచ్ ఏనుగు నరేందర్ రెడ్డి సూచించారు. వినాయక లడ్డూ వేలంలో ఆలం శివ రూ.90 వేలతో పెద్ద లడ్డూను, బుట్టి ఉపేంద్ర రూ.40 వేలతో చిన్న లడ్డూను దక్కించుకున్నారు. విజేతలను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.
ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పలపు రమేష్, ఏనుగు వెంకట్ రెడ్డి, గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఉడుతల జలంధర్ గౌడ్, సీనియర్ నాయకుడు ఉడుతల శంకరయ్య గౌడ్, వార్డు సభ్యులు జంగలి శంకర్, అరుగే అలివేలు తదితరులు పాల్గొన్నారు. గ్రామ పెద్దలు, మాజీ ప్రజాప్రతినిధులు, భక్తులు, మహిళలు, ఉత్సవ నిర్వాహకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# తెలంగాణ తొలితరం ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి

**బడుగు బలహీనవర్గాల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన మహనీయుడు**

**సేవలను స్మరించుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, బక్కని నర్సింహులు, అందే బాబయ్య**



రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 27 (జర్నలిస్ట్ డైరీ) : స్వాతంత్ర్య సమరయోధుడు, తొలితరం తెలంగాణ ఉద్యమకారుడు, బడుగు బలహీనవర్గాల స్ఫూర్తి ప్రదాత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా షాద్‌నగర్ పట్టణంలో పద్మశాలి సంఘం, కాంగ్రెస్ పార్టీ, టీజేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. పట్టణంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలుతో కలిసి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, కొండా లక్ష్మణ్ బాపూజీ స్వాతంత్ర్య సమరంలో పాల్గొని దేశ సేవకు అంకితమైన మహనీయుడని కొనియాడారు. తెలంగాణ ప్రాంత ప్రజల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఆయన తొలినాళ్ల నుంచే ఉద్యమించారని గుర్తుచేశారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం బాపూజీ చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజా హక్కుల కోసం జీవితాంతం పోరాడిన కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. తెలంగాణ సమాజానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, ప్రజల హృదయాల్లో కొండా లక్ష్మణ్ బాపూజీ ఎప్పటికీ నిలిచిపోతారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, బీజేపీ నేత అందే బాబయ్య, పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబార్ అలీ ఖాన్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు వర్కల శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్ జయలక్ష్మి కిషోర్, మురళీమోహన్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖదీర్, మాజీ జడ్పీటీసీ వెంకట్ రాం రెడ్డి, ఇబ్రహీం శ్రీనివాస్ యాదవ్, చందులాల్, ముబారక్ అలీ ఖాన్, శ్రీశైలం గౌడ్, తుపాకుల శేఖర్, కత్తి చంద్రశేఖరప్ప, జంగారి రవి, సాయి కుమార్, మంగ అశోక్, శ్రీను నాయక్, నీరటి వాసు, మధువల యాదవ్, బీరప్ప, బాలగంగాధర్ తిలక్, పద్మశాలి సంఘం నేతలు, టీజేఏసీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్లే పంటలు ఎండాయి

**-కొల్లాపూర్‌లో ఎండిన పంటలను పరిశీలించిన కేటీఆర్**

**-పర్యటనలో పాల్గొన్న మాజీమంత్రులు,మాజీ ఎమ్మెల్యేలు**

**-ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి**



తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 27 (జర్నలిస్ట్ డైరీ) : తెలంగాణ ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీళ్లు ఉన్నప్పటికీ, రేవంత్ రెడ్డి ప్రభుత్వం వాటిని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణకు చెందాల్సిన నీటిని ఆంధ్రప్రదేశ్‌కు వదిలిపెడుతూ, ఇక్కడి రైతుల పంటలను ఎండబెడుతున్నారని ఆయన మండిపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు ఎల్‌నినో ప్రభావం వల్ల వచ్చినవి కావని, ఇదంతా కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కృత్రిమ కరువేనని విమర్శించారు. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ చౌరస్తా సమీపంలోని దేశిటిక్యాల గ్రామ శివారులో కేటీఆర్ పర్యటించారు. అక్కడ ఎండిపోయిన పంట పొలాలను స్థానిక రైతులతో కలిసి ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల బాధలను అడిగి తెలుసుకున్న ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రైతులకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగేంత వరకు బీఆర్ఎస్ పార్టీ తరఫున కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం ఆపేది లేదని ఈ సందర్భంగా కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ పర్యటనలో కేటీఆర్ వెంట మాజీ మంత్రులు జగదీష్ రెడ్డి, సి. లక్ష్మారెడ్డి, వి.శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్ రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డిలతో పాటు పలువురు బీఆర్ఎస్ ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సాంబారులో బల్లి.. ఆసుపత్రి పాలైన 19 మంది విద్యార్థినులు

**-తుని ప్రభుత్వ బాలికల కళాశాల హాస్టల్‌లో ఘటన**

**-భోజనం తిన్న 19 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైన వైనం**

**-బాధితులకు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందస్తున్న వైద్యులు**

**-విద్యార్థినుల ఆరోగ్యం నిలకడగా ఉందన్న వైద్యులు**



తుని,తూర్పుగోదావరి, జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : తూర్పుగోదావరి జిల్లా తునిలో విషాహారం ఘటన కలకలం రేపింది. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వసతి గృహంలో వండిన సాంబారులో బల్లి పడటంతో 19 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన శనివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కళాశాల హాస్టల్‌లో నివసిస్తున్న 49 మంది విద్యార్థినులు నిన్న మధ్యాహ్నం భోజనం చేశారు. భోజనం చేసిన కాసేపటికే 19 మంది విద్యార్థినులకు కడుపు నొప్పి ప్రారంభమైంది. దీంతో అనుమానంతో వారు సాంబారు గిన్నెను పరిశీలించగా, అందులో చనిపోయిన బల్లి కనిపించడంతో విద్యార్థినులు, సిబ్బంది తీవ్ర ఆందోళనకు గురయ్యారు. దీనిపై కళాశాల ప్రిన్సిపల్ వెంటనే స్పందించి వైద్యులకు సమాచారం అందించారు. అయితే సాయంత్రం సమయానికి విద్యార్థినులకు కడుపునొప్పి తీవ్రం కావడంతో వారిని హుటాహుటిన తుని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థినులందరి ఆరోగ్యం నిలకడగా ఉందని, ఎవరికీ ఎలాంటి ప్రమాదం లేదని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. మహేశ్వరరావు తెలిపారు. ముందుజాగ్రత్త చర్యగా రాత్రంతా వారిని వైద్యుల పర్యవేక్షణలో ఉంచి, పూర్తిగా కోలుకున్న తర్వాత డిశ్చార్జ్ చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

**ఫోన్‌లో మాట్లాడి వివరాలు ఆరా తీసిన స్థానిక ఎమ్మెల్యే దివ్య**

ఈ ఘటనపై సమాచారం అందుకున్న స్థానిక ఎమ్మెల్యే యనమల దివ్య అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు ఆరా తీశారు. టీడీపీ నాయకులు యినుగంటి సత్యనారాయణ, మోదుకురి వెంకటేశ్, మళ్ల గణేశ్ తదితరులు ఆసుపత్రికి వెళ్లి విద్యార్థినులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు.

# ఓటు హక్కు పరిరక్షణ కోసం నేడు కాంగ్రెస్ నిరసన



**హైదరాబాద్. (సెప్టెంబర్ 27) జర్నలిస్ట్ డైరీ.**
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ, ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై నిరసన వ్యక్తం చేస్తూ తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాల్లో సెప్టెంబర్ 28న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు టీపీసీసీ ప్రకటించింది. అన్ని జిల్లా కలెక్టరేట్ల ఎదుట ఈ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపింది. టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీల ఆధ్వర్యంలో నిరసనలు నిర్వహించనున్నట్లు పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆంగోత్ వెంకటేష్ పవార్ తెలిపారు. ఎస్. ఐ. ఆర్ ప్రక్రియలో ఓట్ల తొలగింపు, ఓటర్ల జాబితాపై పారదర్శకత వంటి అంశాలపై ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొంన్నారు . నిరసనలో భాగంగా ఆయన దిష్టిబొమ్మ దహనం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, మండల అధ్యక్షులు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వెంకటేష్ పవార్ పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు పరిరక్షణ, పారదర్శక ఓటర్ల జాబితా, ఎన్నికల ప్రక్రియపై స్పష్టత కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన చేపడుతున్నట్లు తెలిపారు.

# ప్రదాత,ఉద్యమకారుడిగా, ప్రజాస్వామిక మానవతావాది ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ .

**పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.**

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 27 (జర్నలిస్ట్ డైరీ) :**
బడుగు బలహీన వర్గాల స్ఫూర్తి ప్రదాత,ఉద్యమకారుడిగా, ప్రజాస్వామిక మానవతావాది ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతిని పురస్కరించుకుని ఆల్విన్ కాలనీ పద్మశాలి సంక్షేమ సంఘం వారి ఆధ్వర్యంలో ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ లో నిర్వహించిన జయంతి వేడుకలలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి తాజా మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తో కలిసి పూలమాల వేసి ఘన నివాళులర్పించిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా గాంధీ గారు మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పోషించిన పాత్ర



మరువలేనిది. 1969లో తొలి దశ పోరాటంలోనే కీలక పాత్ర పోషించి, మంత్రి పదవిని కూడా త్యజించిన గొప్ప త్యాగశీలి అని తెలియచేశారు. భారత స్వాతంత్ర పోరాటం, నిజాం నిరంకుశ వ్యతిరేక ఉద్యమం, ప్రత్యేక తెలంగాణ కోసం ఇలా మూడు దశల ఉద్యమాల్లో ప్రముఖ పాత్ర పోషించి దేశసేవకు అంకితమైన గొప్ప వ్యక్తి కొండాలక్ష్మణ్ బాపూజీ అని, దశాబ్దాల తెలంగాణ కల సాకారమైన వేల ఆ స్వప్నాన్ని మాత్రం ఆయన చూడలేక పోయారు. ఉద్యమాలతోపాటు ప్రజాప్రతినిధిగా నిరంతరం ప్రజాసేవ కోసం తపించిన గొప్ప దార్శనికుడు అని తెలియచేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తి ప్రదాత, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు దిక్సూచిగా నిలిచిన కొండా లక్ష్మణ్ బాపూజీ త్యాగాలు, సేవలు చిరస్మరణీయమని తెలంగాణ ఉద్యమం, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తన సొంత ఇంటిని సైతం ను త్యాగం చేసిన గొప్ప మహనీయుడు అని , బాపూజీ పోరాట స్ఫూర్తి, ప్రజాసేవా నిబద్ధత భావితరాలకు మార్గదర్శకమని ,ఆయన జీవితం ఎంతో మందికి ఆదర్శం అని, నేటి యువత ఆయన జీవితం స్ఫూర్తిదాయకం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు, నాయకులు,కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# గత 33 రోజులుగా ఏపీలో ఒక్క కరోనా కేసు కూడా నమోదు కాలేదు...

**-మంత్రి సత్యకుమార్ కీలక ప్రకటన**

**-ప్రస్తుతం రాష్ట్రంలో యాక్టివ్ కేసులు ఏవీ లేవని ప్రకటన**

**-గత 94 రోజుల్లో 78 మందికి పాజిటివ్**

**-పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నామన్న మంత్రి**



**అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :**
రాష్ట్రంలో గత 33 రోజులుగా ఒక్క కొత్త కరోనా కేసు కూడా నమోదు కాలేదని, ప్రస్తుతం యాక్టివ్ కేసుల సంఖ్య సున్నాకు చేరుకుందని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రకటించారు. ఈ పరిణామంతో రాష్ట్రం కరోనా మహమ్మారి నుండి దాదాపుగా విముక్తి పొందినట్లయింది. మంత్రి ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఆగస్టు 25వ తేదీ నుంచి సెప్టెంబర్ 26 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఒక్క పాజిటివ్ కేసు కూడా వెలుగు చూడలేదని ఆయన తెలిపారు. దీంతో వైద్యారోగ్య శాఖ వర్గాలు ఊపిరి పీల్చుకున్నాయి. గత మూడు నెలల గణాంకాలను పరిశీలిస్తే.. జూన్ 24 నుంచి సెప్టెంబర్ 25 వరకు (94 రోజులు) రాష్ట్రవ్యాప్తంగా 1,086 కరోనా నమూనాలను పరీక్షించగా, కేవలం 78 మందికి మాత్రమే వైరస్ సోకినట్లు నిర్ధారణ అయిందని మంత్రి వివరించారు. వీరిలో 74 మంది ఇప్పటికే పూర్తిగా కోలుకుని ఆసుపత్రుల నుంచి డిశ్చార్జి అయ్యారు. ఈ 94 రోజుల్లో ఏకంగా 66 రోజుల పాటు సున్నా కేసులు నమోదు కావడం గమనార్హం. రాష్ట్రంలో ఎక్కడా కూడా కరోనా కేసులు సమూహాలుగా (క్లస్టర్లుగా) నమోదైన దాఖలాలు లేవని మంత్రి సత్యకుమార్ స్పష్టం చేశారు. ప్రభుత్వం పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు

# ‘ఆపరేషన్ త్రిశూల్’ ప్రోగ్రాంని జిల్లాలో విజయవంతంగా నిర్వహిస్తున్నాం

**-బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్**

**-వార్షిక తనిఖీలో భాగంగా చిన్నగంజాం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ**

**బాపట్ల, జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :**
డ్రగ్స్, మహిళలపై నేరాలు, రోడ్డు ప్రమాదాలను జిల్లాలో సమూలంగా అరికట్టడానికి ‘ఆపరేషన్ త్రిశూల్’ కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ తెలిపారు. వార్షిక తనిఖీలో భాగంగా ఆదివారం జిల్లా ఎస్పీ చిన్నగంజాం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం వార్షిక తనిఖీలో భాగంగా స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్, రైటర్ రూమ్, స్టోర్ రూమ్, కంప్యూటర్ విభాగం, లాకప్ రూమ్‌లతో పాటు వివిధ నేరాల్లో సీజ్ చేసిన వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను సక్రమంగా భద్రపరచాలని ఆదేశించారు. రిసెప్షన్ కౌంటర్‌ను తనిఖీ చేసి, అందులో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదుల వివరాలను రిసెప్షన్ బుక్‌లో ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా నమోదు చేయాలని ఆదేశించారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా నమోదు చేయాలన్నారు.

**రౌడీషీటర్లపై నిఘా ఉండాలి**
రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్లను పరిశీలించి, వారి పాత నేరాల వివరాలు, ప్రస్తుత జీవన విధానం గురించి ఆరా తీశారు. రౌడీషీటర్లు, చెడు నడత కలిగిన వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. కంప్యూటర్ ఆపరేటర్




ద్వారా సీసీటీఎన్ఎస్ అప్లికేషన్‌ను ఓపెన్ చేయించి, కేసుల నమోదు విధానాన్ని, సాంకేతిక పరిజ్ఞానం వినియోగాన్ని స్వయంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించే ప్రతి ఒక్కరూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని ఆదేశించారు.

**సాంకేతిక పరిజ్ఞానంతో కేసులను వేగవంతంగా దర్యాప్తు చేయాలి**
వివిధ క్రైమ్ రికార్డులు, కేసు ఫైళ్లను పరిశీలించి, స్టేషన్ పరిధిలో ఎక్కువగా జరుగుతున్న నేరాల గురించి, వాటిని అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యల గురించి ఆరా తీశారు. నేర నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. విచారణ దశలో ఉన్న కేసులను సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని వేగవంతంగా దర్యాప్తు నిర్వహించి చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా నాయకత్వంలో బాపట్ల జిల్లాలో ‘ఆపరేషన్ త్రిశూల్’ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రధానంగా గంజాయి, డ్రగ్స్ నిర్మూలన, మహిళలపై దాడుల నివారణ, రహదారి భద్రతే లక్ష్యంగా ప్రత్యేక దృష్టి సారించామన్నారు. దీనిపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

**రోడ్డు ప్రమాదాల నివారణకు ‘శిరోరక్ష--ప్రాణరక్ష’**
రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లాలో ‘శిరోరక్ష--ప్రాణరక్ష’ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రయాణించేలా చేయడమేనన్నారు. జిల్లాలో ప్రధానంగా మూడు జాతీయ రహదారులు ఉన్నాయని, జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం జాతీయ, రాష్ట్ర రహదారులపైనే జరుగుతున్నాయని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు జిల్లాలో చర్యలు తీసుకుంటున్నామన్నారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరిగే ప్రమాదాలు, వాటి కారణంగా కుటుంబాలకు కలిగే నష్టాల గురించి స్టేషన్ల వారీగా పోలీసు అధికారులు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారన్నారు. జిల్లాలో తీసుకుంటున్న చర్యల వల్ల గత సంవత్సరంతో పోలిస్తే రోడ్డు ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాల వల్ల సంభవించే మరణాలు దాదాపుగా 22 శాతం వరకు తగ్గాయని తెలిపారు.

**జిల్లాలో ముందస్తు భద్రతా చర్యలు**
రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాల్సిందిగా ఇప్పటికే అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, బాపట్ల జిల్లా పోలీసు యంత్రాంగానికి ప్రజలందరూ సహకరించాలని ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో చీరాల డీఎస్పీ ఎం.డి. మోయిన్, ఇంకొల్లు సీఐ ఎం. రామా నాయక్, ఎస్‌బీ సీఐ జి. నారాయణ, చిన్నగంజాం ఎస్ఐ ఎస్. రమేష్, ఇంకొల్లు ఎస్ఐ సురేష్, చిన్నగంజాం పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపీ వ్యాప్తంగా ‘హోటళ్ల’పై ‘ఫుడ్’ సేఫ్టీ’ దాడులు 25 హోటళ్ల మూసివేత

**-రాష్ట్రవ్యాప్తంగా హోటళ్లపై ఆహార భద్రతాధికారుల దాడులు**

**-నిబంధనల ఉల్లంఘన కారణంగా 25 హోటళ్ల మూసివేత**

**-మొత్తం 66 సంస్థల్లో తనిఖీలు, -30 చోట్ల కేసులు నమోదు**

**-మరో 45 హోటళ్లకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ**

**-లోపాలు సరిదిద్దుకోవాలని యాజమాన్యాలకు స్పష్టమైన ఆదేశాలు**

**అమరావతి,ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :**
ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది. రాష్ట్రవ్యాప్తంగా ఆహార భద్రతా విభాగం అధికారులు హోటళ్లు, రెస్టారెంట్లపై మెరుపు దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో తీవ్రమైన ఉల్లంఘనలు బయటపడటంతో 25 సంస్థలను తక్షణమే మూసివేయించారు. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో ఏకకాలంలో 66 హోటళ్లు, ఇతర ఆహార విక్రయశాలల్లో అధికారులు ఈ తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల వివరాలతో కూడిన నివేదికను వైద్యారోగ్య శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్‌కు అధికారులు సమర్పించారు. వైద్యారోగ్య శాఖ కార్యదర్శి జి. వీరపాండియన్, ఆహార భద్రతా విభాగం డైరెక్టర్ జనరల్ సి. అరుణ్ బాబు పర్యవేక్షణలో ఈ ఆకస్మిక తనిఖీలు జరిగాయి. జాయింట్ ఫుడ్ కంట్రోలర్ బి. శ్రీనివాస్ నేతృత్వంలోని బృందాల్లో 40 మంది ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు, 13 మంది అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్లు పాల్గొన్నారు.

**నిబంధనలు బేఖాతర్..**
నిబంధనలు పాటించని కారణంగా మూసివేసిన వాటిలో అనకాపల్లిలోని ఓ ధాబా, నెల్లూరు జొన్నవాడ రోడ్డులోని మరో ధాబా, నెల్లూరు ట్రంక్ రోడ్డులోని ఓ హోటల్, విశాఖపట్నం ఎంవీపీ కాలనీలోని టిఫిన్ సెంటర్, తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ భోజనశాల ఉన్నాయి. వీటితో పాటు, స్వల్ప ఉల్లంఘనలు గుర్తించిన మరో 45 సంస్థలకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ చేశారు. వివిధ రకాల నిబంధనల ఉల్లంఘనల కింద మొత్తం 30 కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. మూసివేసిన హోటళ్ల యాజమాన్యాలు ఆహార భద్రతా నిబంధనల ప్రకారం అవసరమైన మార్పులు చేసుకోవాలని, లోపాలను సరిదిద్దుకున్న తర్వాతే తిరిగి తెరుచుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భవిష్యత్తులోనూ ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఇలాంటి తనిఖీలు కొనసాగిస్తామని ఉన్నతాధికారులు హెచ్చరించారు

# ‘వ్యభిచార’ ముఠా ‘గుట్టు’రట్టు’..

## -నిర్వాహకురాలితో సహా ఐదుగురి అరెస్ట్



**-గుంటూరులో వ్యభిచార గృహంపై పోలీసుల దాడి**

**-వాట్సాప్ ద్వారా ఫొటోలు పంపి విటులను ఆకర్షిస్తున్నట్లు గుర్తింపు**

**-నిందితుల నుంచి 5 సెల్ ఫోన్లు స్వాధీనం**

**-అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు**

**గుంటూరు,ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :**
గుంటూరు నగరంలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న ఓ వ్యభిచార ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. వాట్సాప్ ద్వారా విటులను ఆకర్షిస్తూ హైటెక్ పద్ధతిలో దందా నిర్వహిస్తున్న ఇంటిపై దాడి చేసి, నిర్వాహకురాలితో సహా మొత్తం ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది.

**వివరాల్లోకి వెళితే...**
ఎస్‌బీ డీఎస్పీ ఆదేశాల మేరకు, టాస్క్‌ఫోర్స్ సీఐ పర్యవేక్షణలో పోలీసులు వ్యభిచార కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ క్రమంలో అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని భారత్‌పేట 7వ లైన్‌లో ఒక ఇంట్లో వ్యభిచారం జరుగుతున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ) సిబ్బంది, అరండల్‌పేట ఎస్ఐ అశోక్ బృందంతో కలిసి ఆదివారం మధ్యాహ్నం 12:45 గంటల సమయంలో ఆ ఇంటిపై సంయుక్తంగా దాడి నిర్వహించారు. ఈ దాడిలో వ్యవస్థీకృతంగా వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆ ఇంట్లో ఉన్న నలుగురు మహిళలతో పాటు, ఒక విటుడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి నుంచి 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. గోరంట్లకు చెందిన పి. సాయి లక్ష్మి అలియాస్ అంజలి ఈ దందాకు నిర్వాహకురాలిగా వ్యవహరిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. విటులను ఆకర్షించేందుకు ఆమె వాట్సాప్ ద్వారా యువతుల ఫొటోలు పంపి డీల్స్ కుదుర్చుకుంటున్నట్లు పోలీసులు గుర్తించారు. అదుపులోకి తీసుకున్న ఐదుగురిని తదుపరి విచారణ, చట్టపరమైన చర్యల కోసం అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# 'స్థానిక సంస్థల' 'ఎన్నికల'ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే లక్ష్యం

**-జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్**

**-చీరాల సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ**

**-చీరాల మున్సిపాలిటీలో అతి సమస్యాత్మక, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ**





**బాపట్ల, జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ తరపున పటిష్టమైన ముందస్తు చర్యలు చేపడుతున్నామని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ తెలిపారు.

చీరాల మున్సిపాలిటీ పరిధిలోని అతి సమస్యాత్మక, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించడంలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదివారం చీరాల సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం చీరాల మున్సిపాలిటీ పరిధి లోని పోలీస్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై పోలీస్ అధికారులకు ఎస్పీ దిశానిర్దేశం చేశారు. అనంతరం పేరాల ఏ.ఆర్.ఎం. హైస్కూల్‌తో పాటు ఇతర ప్రాంతాల్లోని అతి సమస్యాత్మక, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించి పలు ఆదేశాలు జారీ చేశారు.

**ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...**

రానున్న మున్సిపల్, పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బాపట్ల జిల్లా పోలీస్ యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధమవుతోందని తెలిపారు. ఎన్నికలకు ముందస్తుగా సిద్ధమయ్యే ప్రక్రియను బాపట్ల జిల్లా పోలీస్ శాఖ ఇప్పటికే ప్రారంభించిందన్నారు. గ్రామాలు, మున్సిపాలిటీల వారీగా సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ ప్రాంతాలను ముందస్తుగా గుర్తిస్తున్నామని తెలిపారు. ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికలకు సంబంధించిన అన్ని అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది గ్రామాలు, మున్సిపాలిటీల పరిధిలోని అన్ని వార్డులను క్రమం తప్పకుండా సందర్శిస్తూ, వార్డుల వారీగా ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. రౌడీ షీటర్లు, పాత నేరస్థులపై నిరంతరం నిఘా ఉంచామని, వారు రాబోయే రోజుల్లో ఎలాంటి అవాంఛనీయ కార్యకలాపాలకు పాల్పడకుండా తగిన ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. అందులో భాగంగా జిల్లాలోని పోలీస్ అధికారులు గ్రామాలను సందర్శించడం, పోలీస్ స్టేషన్ల పనితీరును సమీక్షించడం, పరిస్థితులను అంచనా వేయడం, ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా, తాను కూడా ఆకస్మికంగా కొన్ని ప్రాంతాలను సందర్శించి పరిస్థితులను పరిశీలిస్తానని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడమే ఈ పర్యటనల ప్రధాన ఉద్దేశమని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చీరాల డీఎస్పీ ఎం.డి. మొయిన్, చీరాల వన్‌టౌన్ సీఐ సోమశేఖర్, టూటౌన్ సీఐ శశికుమార్, చీరాల రూరల్ సీఐ సుధాకర్, చీరాల వన్‌టౌన్, టూటౌన్ ఎస్ఐలు పాల్గొన్నారు.

# ఏపీ 'డిజిటల్ కార్పొరేషన్'కు జాతీయ స్థాయిలో 'గోల్డ్ అవార్డు' రావడంపై అభినందించిన చంద్రబాబు

**-రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖకు సిల్వర్ పురస్కారం**

**-రెండు విభాగాల అధికారులను ప్రత్యేకంగా అభినందించిన సీఎం చంద్రబాబు**

**-డిజిటల్ పాలనలో ఏపీ ప్రగతికి ఇది నిదర్శనమని వ్యాఖ్య**

**-అమరావతి క్వాంటమ్ వ్యాలీ ప్రచారానికి దక్కిన ప్రతిష్ఠాత్మక గుర్తింపు**







**అమరావతి, ఏపీ బ్యూరో జర్నలిస్ట్ డైరీ :** డిజిటల్ పాలన, సాంకేతిక ఆవిష్కరణలలో ఆంధ్రప్రదేశ్ మరోసారి జాతీయ స్థాయిలో తన సత్తా చాటిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రానికి చెందిన రెండు కీలక ప్రభుత్వ విభాగాలకు ప్రతిష్ఠాత్మక అవార్డులు లభించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ పురస్కారాలను సాధించిన ఆంధ్రప్రదేశ్ డిజిటల్ కార్పొరేషన్ (ఏపీడీసీ), సమాచార, పౌర సంబంధాల శాఖ (ఐ అండ్ పీఆర్) అధికారులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. వివరాల్లోకి వెళితే, అమరావతి క్వాంటమ్ వ్యాలీకి సంబంధించి చేపట్టిన డిజిటల్, సోషల్ మీడియా ప్రచారం, అవగాహన కార్యక్రమానికి గాను ఏపీడీసీకి గోల్డ్ అవార్డు దక్కింది. దేశ వ్యాప్తంగా అత్యంత పరిమిత సంఖ్యలో ప్రకటించిన గోల్డ్ అవార్డులలో ఒకటి మన రాష్ట్రానికి దక్కడం గర్వకారణమని సీఎం పేర్కొన్నారు. ఈ గుర్తింపు రాష్ట్ర ప్రభుత్వం టెక్నాలజీ వినియోగంలో ఎంత ముందుందో చాటుతోందని అన్నారు.

**సమాచార, పౌర సంబంధాల శాఖకు సిల్వర్ అవార్డు**

అదేవిధంగా, మీడియా అక్రిడిటేషన్, మేనేజ్‌మెంట్ సిస్టమ్ కోసం సమాచార, పౌర సంబంధాల శాఖకు సిల్వర్ అవార్డు లభించింది. దేశవ్యాప్తంగా ఇచ్చిన 30 సిల్వర్ అవార్డుల్లో ఏపీకి ఒకటి దక్కడం హర్షణీయమని చంద్రబాబు తెలిపారు.

**ఈ విజయం రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ గర్వకారణమన్న సీఎం**

సాంకేతిక ఆధారిత పాలన, డిజిటల్ ఆవిష్కరణలలో ఆంధ్రప్రదేశ్ సాధిస్తున్న పురోగతికి ఈ జాతీయ స్థాయి గుర్తింపు ఒక నిదర్శనమని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఈ విజయం రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ గర్వకారణమని, భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని అధికారులను ప్రోత్సహించారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సులభంగా, పారదర్శకంగా అందించడంలో టెక్నాలజీ పాత్రను ఆయన ఈ సందర్భంగా మరోసారి నొక్కి చెప్పారు

# విజయవాడలో 'సచివాలయ ఉద్యోగుల' ఆందోళన'తో తీవ్ర ఉద్రిక్తత

**-విజయవాడలో సచివాలయ ఉద్యోగుల ఆందోళన..**

**-ధర్నా చౌక్‌కు వెళ్లకుండా ఉద్యోగులను అడ్డుకున్న పోలీసులు**

**-పలువురి అరెస్ట్**

**-స్పందించిన మంత్రి డోలా**

**-ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి డీబీవీ స్వామి హామీ**

**-రాజకీయ లబ్ధి కోసమే కొందరు ఉద్యోగులను రెచ్చగొడుతున్నారని ఆరోపణ**

**-లిఖితపూర్వక హామీ ఇచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని ఉద్యోగుల స్పష్టీకరణ**





**విజయవాడ,ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** తమ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు విజయవాడలో చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. వేలాదిగా తరలివచ్చిన ఉద్యోగులను పోలీసులు అడ్డుకోవడంతో ధర్నా చౌక్ వద్ద తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ పరిణామాలపై ప్రభుత్వం స్పందిస్తూ, ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చింది.

ఆదివారం ఉదయం, రాష్ట్ర నలుమూలల నుంచి సచివాలయ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో విజయవాడలోని గాంధీ నగర్ ధర్నా చౌక్‌కు చేరుకున్నారు. ఏడేళ్లుగా సచివాలయ సిబ్బందిగా పనిచేస్తున్నా, ప్రభుత్వం నుంచి అందాల్సిన ప్రయోజనాలు, సౌకర్యాలు అందడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

**అడ్డుకున్న పోలీసులు**

అయితే, ధర్నా చౌక్‌కు చేరుకోకముందే పోలీసులు వారిని ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, నిరసనకారులకు మధ్య తోపులాట జరిగింది. పోలీసుల వలయాన్ని ఛేదించుకుని పలువురు ఉద్యోగులు ధర్నా చౌక్‌కు చేరుకోవడానికి ప్రయత్నించగా, పోలీసులు వారిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. ప్రభుత్వ వైఖరికి, పోలీసుల చర్యలకు వ్యతిరేకంగా ఉద్యోగులు నినాదాలు చేశారు.

**ఉద్యోగుల ఆందోళనపై మంత్రి స్పందన**

సచివాలయ ఉద్యోగుల ఆందోళనపై మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి స్పందించారు. ఉద్యోగుల సంక్షేమం విషయంలో సంకీర్ణ ప్రభుత్వం పూర్తి సానుకూలంగా ఉందని ఆయన భరోసా ఇచ్చారు. సిబ్బంది రెగ్యులరైజేషన్, వారికి కల్పించాల్సిన సౌకర్యాల విషయంలో ప్రభుత్వం వెనకడుగు వేయదని స్పష్టం చేశారు. ఉద్యోగులకు గతంలో జరగాల్సిన రెగ్యులరైజేషన్‌ను ప్రస్తుత ప్రభుత్వమే అమలు చేసిందని గుర్తు చేశారు. త్వరలో కొత్త పీఆర్సీ కమిషన్ వేయబోతున్నామని తీపి కబురు చెప్పారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు, పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని మంత్రి తెలిపారు. వారి డిమాండ్ మేరకు నోషనల్ ఇంక్రిమెంట్ల దస్త్రం ఆర్థిక శాఖ పరిశీలనకు పంపామని వెల్లడించారు. అయితే, కొందరు వ్యక్తులు రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్యోగులను రెచ్చగొడుతున్నారని ఆయన ఆరోపించారు. ఆందోళన ముసుగులో సంఘ విద్రోహ శక్తులు చొరబడి హింసకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**హామీ లభించేంత వరకు తమ ఆందోళన కొనసాగుతుంది**

ప్రభుత్వం నుంచి స్పష్టమైన లిఖితపూర్వక హామీ లభించేంత వరకు తమ ఆందోళన కొనసాగుతుందని ఉద్యోగ సంఘాల నేతలు స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వ హామీలు, ఉద్యోగుల డిమాండ్ల నేపథ్యంలో ఈ వ్యవహారంపై ప్రతిష్టంభన కొనసాగుతోంది

# షాద్‌నగర్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవ చెస్ చాంపియన్‌షిప్

**చదరంగంతో మేధో వికాసం.. సీఐ సీతారాం ప్రత్యేక సందేశం**

**గణేష్ ఉత్సవ చెస్ చాంపియన్‌షిప్‌కు విశేష స్పందన**

**చెస్‌తో ఆలోచన శక్తి పదును.. సీఐ సీతారాం**




**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 27 (జర్నలిస్ట్ డైరీ) :** చదరంగం ఆడటం వల్ల విద్యార్థుల్లో ఆలోచన శక్తి, ఏకాగ్రత, మేధో వికాసం పెరుగుతాయని షాద్‌నగర్ పట్టణ సీఐ సీతారాం అన్నారు. ఆదివారం పట్టణంలోని పతంజలి యోగ సెంటర్‌లో షాద్‌నగర్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో తొలిసారి గణేష్ ఉత్సవ చెస్ చాంపియన్‌షిప్ నిర్వహించారు. చెస్ మాస్టర్ వారణాసి జగన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీలకు సీఐ సీతారాం ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. అండర్-8 విభాగంలో సాయి సౌరిష్, రియాన్ష్, సాయి కార్తీక్‌రెడ్డి; అండర్-10లో శ్రీమాన్‌రెడ్డి, ఆయుష్, సిద్ధార్థ్ లక్ష్మణ్; అండర్-12లో శ్రీ హర్షిత్, వేదాదిత్య, నిహాల్‌రెడ్డి; అండర్-14లో భానుతేజ, సాత్విక్, శ్రీకర్; అండర్-16లో అద్వైత్, సాత్విక్, గౌతమ్ బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చెస్ కేవలం వినోదం కోసం ఆడే ఆట కాదని, ప్రతి ఎత్తును ఆలోచించి నిర్ణయం తీసుకోవడం ద్వారా విద్యార్థుల్లో మేధో సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లోనూ చురుకుగా పాల్గొనాలని సూచించారు. చిన్న వయస్సు నుంచే చెస్‌పై ఆసక్తి పెంచుకుంటే రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉంటుందన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మేధో క్రీడలను ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఆర్బిటర్ మణికంట, సర్పంచులు కృష్ణవేణి హరినాయక్, బాబు నాయక్, శ్రీకాంత్ యాదవ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చొరవతో మొహమ్మద్ గౌస్‌కు రూ.2.50 లక్షల సీఎంఆర్ఎఫ్ సాయం

**చికిత్సకు అండగా నిలిచిన ప్రజాప్రతినిధులు**

**తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు కాకి రంగరాజు**

**మున్సిపల్ చైర్మన్ గడ్డం అనన్య**

**కౌన్సిలర్ దుర్గం మల్లికార్జున్ గౌడ్,**



వికారాబాద్ పట్టణంలోని 31వ వార్డుకు చెందిన మొహమ్మద్ గౌస్‌కు వైద్య చికిత్స నిమిత్తం (రాజ)రూ. 2.50 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ఆర్థిక సహాయం మంజూరైంది. తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ సిఫారసుతో ఈ సహాయం మంజూరైంది. శివరాంనగర్ కాలనీకి చెందిన మొహమ్మద్ గౌస్‌కు హైదరాబాద్ పంజాగుట్టలోని నిమ్స్‌లో జ1-జ2 పోస్టీరియర్ ఫిక్సేషన్ (న్యూరో సర్జరీ) చికిత్స అవసరం కావడంతో సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకుని ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ. 2.50 లక్షల సహాయం మంజూరయ్యేలా సిఫారసు చేశారు. ఈ ప్రక్రియలో 31వ వార్డు కౌన్సిలర్ దుర్గం మల్లికార్జున్ గౌడ్, వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య, తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు కాకి రంగరాజ్ సహకారం అందించారు. రూ. 2,50,000 సీఎంఆర్ఎఫ్ సహాయం మంజూరు చేస్తూ 26-09-2026న ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి నిమ్స్ డైరెక్టర్‌కు లేఖ జారీ అయింది. చికిత్స అనంతరం బిల్లులను సమర్పించిన తర్వాత వాస్తవ వైద్య ఖర్చు లేదా మంజూరైన మొత్తంలో తక్కువైన మొత్తాన్ని రీయింబర్స్‌మెంట్‌గా అందించనున్నట్లు లేఖలో పేర్కొన్నారు. తమ కుటుంబానికి వైద్య చికిత్స కోసం ఆర్థిక సహాయం అందేలా చొరవ తీసుకున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు, తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు కాకి రంగరాజు మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య, కౌన్సిలర్ దుర్గం మల్లికార్జున్ గౌడ్,లకు మొహమ్మద్ గౌస్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు చిరస్మరణీయం: మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ



**దేవరకొండ సెప్టెంబర్ 27 జర్నలిస్ట్ డైరీ :** స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమ నేత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి మహనీయునికి ఘనంగా మునిసిపల్ చైర్మన్ పున్న శైలజ నివాళులర్పించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతు కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఆత్మగౌరవం, బడుగు, బలహీన వర్గాల హక్కులు, సామాజిక న్యాయం కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు. నిస్వార్థ ప్రజాసేవకు, విలువలతో కూడిన రాజకీయ జీవితానికి, అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన జీవితం ఒక గొప్ప ఆదర్శమని పేర్కొన్నారు. "పదవులు, అధికారాల కంటే ప్రజల హక్కులకే ప్రాధాన్యతనిస్తూ తన జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ పోరాట స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకం. తెలంగాణ ఉద్యమంలో ఆయన పోషించిన చారిత్రాత్మకమైనదని, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి చేసిన కృషి, సామాజిక సమానత్వం కోసం సాగించిన పోరాటం ఎప్పటికీ చిరస్మరణీయం. వారి ఆశయాలు, ఆదర్శాలను ఆచరణలో ముందుకు తీసుకెళ్లడమే మనం కొండా లక్ష్మణ్ బాపూజీ కి అందించే నిజమైన నివాళి" అని చైర్మన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, మునిసిపల్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ధర్నా విధుల్లో ఉన్న 'సీఐ' 'అహ్మద్ అలీ' 'హఠాన్మరణం'...

-విజయవాడలో విషాద ఘటన..

-విజయవాడలో విధి నిర్వహణలో సీఐ అలీ మృతి

-బందోబస్తులో ఉండగా గుండెపోటుతో కుప్పకూలిన వైనం

-ఆసుపత్రికి తరలించినా ఫలితం దక్కని వైనం

-సీఐ మృతితో పోలీసు శాఖలో తీవ్ర విషాదం

-కుటుంబ సభ్యులు, సహోద్యోగుల కన్నీరుమున్నీరు



**విజయవాడ,ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ** విజయవాడ నగరంలో విషాద ఘటన చోటు చేసుకుంది. విధి నిర్వహణలో ఉన్న పోలీసు అధికారి గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. నున్న పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా పనిచేస్తున్న అహ్మద్ అలీ, విధుల్లో ఉండగానే తీవ్ర అస్వస్థతకు గురై ప్రాణాలు కోల్పోయారు.

**వివరాల్లోకి వెళితే...**

ఆదివారం సచివాలయ ఉద్యోగులు తలపెట్టిన ఆందోళన కార్యక్రమం నేపథ్యంలో విజయవాడ వ్యాప్తంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ భద్రతా ఏర్పాట్లలో భాగంగా సీఐ అహ్మద్ అలీ తన సిబ్బందితో కలిసి గాంధీ నగర్‌లోని ధర్నా చౌక్ వద్ద విధుల్లో పాల్గొన్నారు. పరిస్థితిని పర్యవేక్షిస్తూ, చురుకుగా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో ఆయనకు హఠాత్తుగా ఛాతీలో నొప్పి రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయారు.

**అప్రమత్తమైన సహచర సిబ్బంది**

వెంటనే అప్రమత్తమైన సహచర సిబ్బంది, ఇతర అధికారులు ఆయనను హుటాహుటిన విజయవాడలోని ఆంధ్రా హాస్పిటల్ కు తరలించారు. అత్యవసర విభాగంలో వైద్యులు ఆయనకు తక్షణ చికిత్స అందించేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. అయితే, అప్పటికే ఆయన పరిస్థితి విషమించడంతో చికిత్స ఫలించక తుదిశ్వాస విడిచారు.

**పోలీసు వర్గాలను తీవ్రంగా కలిచివేసిన ఘటన**

విధి నిర్వహణలోనే ఒక సమర్థుడైన అధికారి ప్రాణాలు కోల్పోవడం పోలీసు వర్గాలను తీవ్రంగా కలిచివేసింది. సీఐ అలీ మరణవార్త తెలియగానే ఆయన కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆయనతో కలిసి పనిచేసిన సహచర అధికారులు, సిబ్బంది ఈ ఘటనతో దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయన మృతి పట్ల పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. నిత్యం విధులకు అంకితభావంతో పనిచేసే అధికారిని కోల్పోయామని సహచరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

# చిన్ననాటి స్నేహానికి ఆత్మీయ సత్కారం

**రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతకు ఘన సన్మానం**

**మిడ్జిల్ , సెప్టెంబర్ 27, జర్నలిస్ట్ డైరీ :** మిడ్జిల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో1994-1995 పదవ తరగతి బ్యాచ్ మున్ననూర్ గ్రామానికి చెందిన చిన్ననాటి స్నేహానికి గుర్తుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత విష్ణువర్ధన్ గౌడ్‌ను ఆయన బాల్య స్నేహితురాలు శ్రీమతి అవ్వారి శారద, ఆమె భర్త జీవశాస్త్ర ఉపాధ్యాయులు శ్రీ బిక్షపతి ఆత్మీయంగా సన్మానించి అభినందించారు.రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఆయనను ఘనంగా సత్కరించారు. ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న బాల్య స్నేహాన్ని గుర్తు చేసుకుంటూ జరిగిన ఈ సన్మానం మధురమైన జ్ఞాపకంగా నిలిచిందని పేర్కొన్నారు.విష్ణువర్ధన్ గౌడ్ ఉపాధ్యాయ వృత్తిలో మరిన్ని ఉన్నత పురస్కారాలు అందుకోవాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.

# బొత్స' సొంత అడ్డాలో 'వైసీపీ'కి భారీ షాక్.. సామూహికంగా నేతల 'రాజీనామా'!

-బొత్స సత్యనారాయణ సొంత నియోజకవర్గంలో వైసీపీకి గట్టి ఎదురుదెబ్బ

-మెరకముడిదాం మండలంలో సామూహికంగా రాజీనామా చేసిన నేతలు

-పార్టీని వీడిన వారిలో మండల అధ్యక్షుడు, 13 గ్రామాల మాజీ ప్రజా ప్రతినిధులు

-బొత్స మేనల్లుడు చిన్న శ్రీను బాటలోనే పయనిస్తామని వెల్లడి

-త్వరలో టీడీపీలో చేరనున్నట్లు ప్రకటించిన నేతలు



**చీపురుపల్లి,ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ సొంత నియోజకవర్గం చీపురుపల్లిలో ఆ పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. మెరకముడిదాం మండలంలో పార్టీకి చెందిన పలువురు కీలక నేతలు సామూహికంగా రాజీనామా చేశారు. దీంతో స్థానిక రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.

**ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే...**

మెరకముడిదాం వైసీపీ మండల అధ్యక్షుడు కోట్ల వెంకట్రావుతో పాటు 13 గ్రామాలకు చెందిన పలువురు మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర ముఖ్య నేతలు ఆదివారం పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తమ రాజీనామా లేఖలను వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి పంపుతున్నట్లు వారు తెలిపారు.

**ఇటీవలే వైసీపీని వీడి టీడీపీలో చేరిన బొత్స మేనల్లుడి బాట లోనే...**

ఇటీవలే వైసీపీని వీడి టీడీపీలో చేరిన బొత్స మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)ను తామంతా అనుసరిస్తామని ఈ సందర్భంగా నేతలు స్పష్టం చేశారు. త్వరలోనే వారంతా టీడీపీలో చేరనున్నట్లు తెలుస్తోంది. గతంలో కూడా చీపురుపల్లికి చెందిన ఓ మాజీ జెడ్పీటీసీ దంపతులు పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

**వైసీపీకి ఇబ్బందికర పరిణామంగా రాజీనామాల వ్యవహారం**

2029 అసెంబ్లీ ఎన్నికల్లో చీపురుపల్లి నుంచే పోటీ చేస్తానని బొత్స సత్యనారాయణ ఇటీవలే ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆయన సొంత నియోజకవర్గంలోనే పార్టీ సంస్థాగత నిర్మాణం బలహీనపడటం వైసీపీకి ఇబ్బందికర పరిణామంగా మారింది. ఈ వరుస రాజీనామాలు రానున్న రోజుల్లో నియోజకవర్గ రాజకీయ సమీకరణాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయో చూడాలి

# వైసీపీ మాజీ ఎమ్మెల్యేపై చీటింగ్ కేసు...

-వైసీపీ మాజీ ఎమ్మెల్యే అన్నబత్తుని శివకుమార్‌పై చీటింగ్ కేసు నమోదు

-రూ.3 కోట్ల రుణం కోసం అమ్మేసిన భూమిని తనఖా పెట్టారని ఆరోపణ

-ఫైనాన్స్ కంపెనీ ఫిర్యాదుతో శివకుమార్, ఆయన భార్యపై ఎఫ్ఐఆర్

-వడ్డీలతో కలిపి బకాయి రూ.5 కోట్లు దాటినట్లు వెల్లడి

-నాటి ఎమ్మెల్యే హోదాను దుర్వినియోగం చేశారని ఫిర్యాదులో ఆరోపణ



**తెనాలి,గుంటూరు,ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** గుంటూరు జిల్లా తెనాలికి చెందిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌పై చీటింగ్ కేసు నమోదైంది. ఓ ఫైనాన్స్ కంపెనీని మోసం చేశారనే ఆరోపణలతో ఆయనతో పాటు ఆయన భార్య, మరో వ్యక్తిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అప్పటికే అమ్మేసిన భూమిని రుణం కోసం తనఖా పెట్టి మోసానికి పాల్పడ్డారని ఫైనాన్స్ సంస్థ ఫిర్యాదు చేసింది.

**వివరాల్లోకి వెళితే...**

శివకుమార్ 2019లో తెనాలి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఈ ఘటన జరిగింది. ఏపీజే ఇంప్లెక్స్ కంపెనీ డైరెక్టర్‌గా ఉన్న ఆయన భార్య అన్నాబత్తుని పుష్ప, విజయవాడకు చెందిన ఐకేఎఫ్ ఫైనాన్స్ సంస్థ నుంచి రూ.3 కోట్ల రుణం తీసుకున్నారు. ఈ రుణానికి శివకుమార్ హామీదారుగా (గ్యారంటర్) ఉన్నారు. ఇందుకుగాను తెనాలిలోని 1,200 చదరపు గజాల స్థలాన్ని తనఖా పెట్టారు.

**అసలు, వడ్డీలతో కలిపి మొత్తం రూ.5 కోట్లు దాటింది**

అయితే, రుణం తీసుకున్న తర్వాత వాయిదాలు సక్రమంగా చెల్లించలేదు. దీంతో అసలు, వడ్డీలతో కలిపి బకాయి మొత్తం రూ.5 కోట్లు దాటింది. బకాయి వసూలు కోసం ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు తనఖా పెట్టిన ఆస్తిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించగా అసలు విషయం బయట పడింది. తెనాలి మున్సిపాలిటీ రికార్డుల ప్రకారం, ఆ స్థలంలో కేవలం 700 చదరపు గజాలు మాత్రమే శివకుమార్ పేరు మీద ఉందని, మిగిలిన 500 గజాలను 2012లోనే ఇతరులకు విక్రయించారని తేలింది.

**అమ్మేసిన భూమిని కూడా తమదిగా చూపించి...మోసం**

అప్పటికే అమ్మేసిన భూమిని కూడా తమదిగా చూపించి, మొత్తం 1,200 గజాల స్థలాన్ని తనఖా పెట్టి మోసం చేశారని ఐకేఎఫ్ ఫైనాన్స్ లీగల్ మేనేజర్ శ్రీనివాసరావు తెనాలి వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాటి ఎమ్మెల్యే హోదాను దుర్వినియోగం చేసి ఈ మోసానికి పాల్పడ్డారని, రిజిస్ట్రేషన్ కార్యాలయం స్థాయిలోనూ అవకతవకలు జరిగి ఉండవచ్చని ఆయన తన ఫిర్యాదులో అనుమానం వ్యక్తం చేశారు.

**వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు**

ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు అన్నాబత్తుని శివకుమార్, ఆయన భార్య పుష్ప, కంపెనీ మేనేజింగ్ పార్ట్‌నర్ తూనుగుంట్ల శ్రీనివాస్‌పై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఫైనాన్స్ కంపెనీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుపుతామని తెనాలి వన్ టౌన్ సీఐ సీహెచ్ రాంబాబు తెలిపారు

# పొలాల్లో విద్యుత్ వైర్ల చోరీలకు పాల్పడుతున్న 11 మంది ముఠా అరెస్ట్

-ఏడు కేసులను ఛేదించిన భట్టిప్రోలు పోలీసులు..

-14 కేజీల రాగి వైర్లు,

-350 మీటర్ల అల్యూమినియం వైర్లు స్వాధీనం

-రెండు ద్విచక్ర వాహనాలు, -రెండు వైర్ కట్టర్లు సీజ్..

-కేసు వివరాలు వెల్లడించిన రేపల్లె డీఎస్పీ అబ్దుల్ అజీజ్



**భట్టిప్రోలు, బాపట్ల, జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** రైతుల పొలాల్లోని విద్యుత్ మోటార్లకు సంబంధించిన రాగి, అల్యూమినియం వైర్లను దొంగిలిస్తూ వరుస చోరీలకు పాల్పడుతున్న 11 మంది సభ్యుల ముఠాను భట్టిప్రోలు పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 14 కేజీల రాగి వైర్లు, 350 మీటర్ల అల్యూమినియం విద్యుత్ వైర్లు, దొంగతనాలకు ఉపయోగించిన రెండు ద్విచక్ర వాహనాలు, రెండు విద్యుత్ వైర్ కట్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా ఏడు దొంగతనం కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఆదివారం భట్టిప్రోలు పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రేపల్లె డీఎస్పీ అబ్దుల్ అజీజ్ కేసు వివరాలను వెల్లడించారు.

**రాగి, అల్యూమినియం వైర్లను లక్ష్యంగా దొంగతనాలు**

భట్టిప్రోలు, వేమూరు, కొల్లూరు, కొల్లిపర్ర, తెనాలి మండలాల పరిధిలోని వ్యవసాయ పొలాల్లో విద్యుత్ మోటార్లకు సంబంధించిన రాగి, అల్యూమినియం వైర్లను లక్ష్యంగా చేసుకుని ఈ ముఠా దొంగతనాలకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ వరుస చోరీలను జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నిందితులను పట్టుకోవాలని ఆదేశించారు.

**రైతుల ఫిర్యాదుతో వెలుగులోకి..**

భట్టిప్రోలు మండలం ఓలేరు గ్రామానికి చెందిన పర్చూరి రమేష్ (54)తో పాటు ఓలేరు, పెదపులివర్రు గ్రామాలకు చెందిన పలువురు రైతులు తమ పొలాల్లో విద్యుత్ మోటార్ల కనెక్షన్లకు సంబంధించిన సుమారు 250 మీటర్ల రాగి వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సెప్టెంబర్ 17వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి సెప్టెంబర్ 18వ తేదీ ఉదయం 8 గంటల మధ్య ఈ చోరీ జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దొంగిలించబడిన వైర్ల విలువ సుమారు రూ.25 వేలు ఉంటుందని తెలిపారు. ఈ ఫిర్యాదుపై సెప్టెంబర్ 24న భట్టిప్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**సాంకేతిక పరిజ్ఞానంతో ముఠా గుట్టురట్టు**

వేమూరు సర్కిల్ పరిధిలో వరుసగా జరుగుతున్న విద్యుత్ వైర్ల దొంగతనాలను ఛేదించేందుకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రేపల్లె డీఎస్పీ అబ్దుల్ అజీజ్ సూచనలతో వేమూరు సీఐ నఫీజ్ భాషా ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. భట్టిప్రోలు ఎస్ఐ కె. అమీర్ తన సిబ్బందితో కలిసి రెండు బృందాలుగా ఏర్పడి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో నిందితులను గుర్తించి ఆదివారం ఉదయం 9 గంటలకు భట్టిప్రోలు మండలం వెల్లటూరు చిన్నరేవు వంతెన కింద అరెస్ట్ చేశారు.

**అరెస్టయిన 11 మంది వీరే..**

ఆవుల కోటయ్య అలియాస్ కోటిగాడు (33) -- జగనన్న కాలనీ, వెల్లటూరు.
కొమరగిరి వీరాంజనేయులు (30) -- చెన్నకేశవ కాలనీ, వెల్లటూరు.
ఆవుల యేసు (23) -- జగనన్న కాలనీ, వెల్లటూరు.
ఆవుల యేసు అలియాస్ జంకడు (30) -- వెల్లటూరు కాలువ సమీపం.
ఆవుల యేసుబాబు అలియాస్ మొద్దోడు (27) -- ఏడు తూముల సమీపం, వెల్లటూరు.
ఆవుల యేసు అలియాస్ అవనిగడ్డ యేసు (40) -- అంకమ్మ మాన్యం, అవనిగడ్డ, కృష్ణా జిల్లా.
ఆవుల సాంబయ్య (25) -- జగనన్న కాలనీ, వెల్లటూరు.
శీలం మహేష్ (23) -- జగనన్న కాలనీ, వెల్లటూరు.
తుపాకుల ఇస్సాకు (26) -- పాత కాలనీ, వెల్లటూరు.
బాపట్ల రాజేష్ (27) -- పాత కాలనీ, వెల్లటూరు.
కుందేటి నాగ వెంకట గోపి అలియాస్ గోపి (22) -- భట్టిప్రోలు

**ఏడు కేసుల్లో నిందితులు**

అరెస్టయిన ముఠాపై భట్టిప్రోలు పోలీస్ స్టేషన్‌లో మూడు, కొల్లూరు, తెనాలి రూరల్, కొల్లిపర్ర, వేమూరు పోలీస్ స్టేషన్లలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం ఏడు కేసులు నమోదైనట్లు పోలీసులు వెల్లడించారు.వీటిలో భట్టిప్రోలు పోలీస్ స్టేషన్‌లో రెండు రాగి వైర్ల దొంగతనం కేసులు, ఒక అల్యూమినియం వైర్ల దొంగతనం కేసు ఉన్నాయి. కొల్లూరు, తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల్లోనూ రాగి, అల్యూమినియం వైర్ల చోరీలు చోటుచేసుకున్నాయి. కొల్లిపర్ర, వేమూరు పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులు కూడా అల్యూమినియం వైర్ల దొంగతనాలకు సంబంధించినవే.

**భారీగా చోరీ సొత్తు స్వాధీనం**

నిందితుల నుంచి 14 కేజీల రాగి వైర్లు, 350 మీటర్ల అల్యూమినియం విద్యుత్ వైర్లు, దొంగతనాలకు ఉపయోగించిన రెండు ద్విచక్ర వాహనాలు, రెండు విద్యుత్ వైర్ కట్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.ఈ కేసులను ఛేదించి నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ కనబరిచిన వేమూరు సీఐ నఫీజ్ భాషా, భట్టిప్రోలు ఎస్ఐ కె. అమీర్, పోలీసు సిబ్బందిని రేపల్లె డీఎస్పీ అబ్దుల్ అజీజ్ ప్రత్యేకంగా అభినందించారు.

## బిజినెస్

# వారంలో రూ.10 వేల తగ్గిన వెండి ధర

హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు వారం వ్యవధిలో గణనీయంగా తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్లలో చోటుచేసుకున్న మార్పులు, పెట్టుబడిదారుల కొనుగోళ్లలో హెచ్చుతగ్గులు వంటి అంశాల ప్రభావంతో విలువైన లోహాల ధరల్లో మార్పులు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో వారం రోజుల వ్యవధిలో బంగారం ధరలు తగ్గగా.. వెండి ధర ఏకంగా రూ.10 వేల మేర పడిపోయింది. ఈ నెల 20న హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,55,840గా ఉంది. వారం రోజుల తర్వాత ఈ ధర రూ.3,160 తగ్గి రూ.1,52,680కు చేరింది. దీంతో 24 క్యారెట్ల పసిడి ధరలో స్వల్పంగా తగ్గుదల నమోదైంది. ఇదే సమయంలో 22 క్యారెట్ల బంగారం ధర కూడా తగ్గింది. ఈ నెల 20న 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి రూ.1,42,850గా ఉండగా.. ప్రస్తుతం రూ.2,900 తగ్గి రూ.1,39,950కు చేరింది. మరోవైపు వెండి ధరలో మాత్రం మరింత స్పష్టమైన తగ్గుదల కనిపించింది. కిలో వెండి ధర వారం వ్యవధిలో రూ.10 వేల మేర తగ్గింది. ఈ నెల 20న




కిలో వెండి ధర రూ.2,60,000గా ఉండగా.. ప్రస్తుతం రూ.2,50,000కు చేరింది. దీంతో వెండి కొనుగోలు చేయాలనుకునే వారికి కొంత ఊరట లభించినట్లయింది. బంగారం, వెండి ధరలు రోజువారీగా మారుతూ ఉంటాయి. అంతర్జాతీయ మార్కెట్ పరిణామాలు, డాలర్ మారకం విలువ, దేశీయ డిమాండ్, పెట్టుబడిదారుల కొనుగోళ్లు వంటి పలు అంశాలు ధరలపై ప్రభావం చూపుతాయి. ప్రస్తుతం హైదరాబాద్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు గత వారంతో పోలిస్తే తక్కువ స్థాయిలో కొనసాగుతున్నాయి. అయితే మార్కెట్‌లో ప్రకటించే ధరలకు అదనంగా పన్నులు, ఇతర ఛార్జీలు వర్తిస్తాయి. ప్రస్తుతం బంగారం, వెండి ధరలపై 3 శాతం జీఎస్టీ అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఆభరణాల కొనుగోలుపై తయారీ చార్జీలు కూడా ఉండటంతో తుది ధర మరింత పెరిగే అవకాశం ఉంటుంది. అందువల్ల కొనుగోలు చేసే సమయంలో తాజా మార్కెట్ ధరతో పాటు జీఎస్టీ, తయారీ చార్జీలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

## పండగ సీజన్ వేళ.. భారీగా పెరగనున్న ఏసీ, టీవీల ధరలు



పండగ సీజన్ ప్రారంభానికి ముందే వినియోగదారులకు గృహోపకరణాల కంపెనీలు షాక్ ఇచ్చాయి. ఏసీలు, ఎల్‌ఈడీ టీవీలు, వాషింగ్ మెషిన్లు, రిఫ్రిజిరేటర్లు సహా పలు కన్జూమర్ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల ధరలను పెంచుతున్నట్లు కంపెనీలు ప్రకటించాయి. అక్టోబర్ 1 నుంచి కొత్త ధరలు అమల్లోకి రానున్నాయి. దీంతో పండగల సమయంలో కొత్తగా గృహోపకరణాలు కొనుగోలు చేయాలనుకునే వారికి అదనపు భారం పడనుంది. ఏసీల ధరలు 5 నుంచి 8 శాతం వరకు పెంచనున్నట్లు తెలుస్తోంది. ఇతర గృహోపకరణాల ధరలు 3 నుంచి 4 శాతం వరకు పెరగనున్నాయి. ముఖ్యంగా పండగ సీజన్‌లో టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషిన్లు, ఏసీలకు డిమాండ్ పెరిగే సమయంలో ధరల పెంపు వినియోగదారులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ముడిపదార్థాల ధరలు పెరగడం వల్ల ఉత్పత్తి వ్యయం పెరిగిందని కంపెనీలు చెబుతున్నాయి. ముఖ్యంగా కాపర్, స్టీల్, ప్లాస్టిక్ వంటి కీలక ముడిపదార్థాల ధరల్లో పెరుగుదల చోటుచేసుకోవడంతో తయారీ ఖర్చులు పెరిగినట్లు పేర్కొంటున్నాయి. దీనికి తోడు రూపాయి విలువలో హెచ్చుతగ్గులు కూడా దిగుమతుల వ్యయంపై ప్రభావం చూపుతున్నాయని కంపెనీలు వెల్లడించాయి. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల ప్రభావం కూడా ముడిసరుకులు, రవాణా వ్యయాలపై పడుతోందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఉత్పత్తుల ధరలను సవరించాల్సి వస్తోందని కంపెనీలు పేర్కొంటున్నాయి. అక్టోబర్ 1 నుంచి కొత్త ధరలు అమల్లోకి రావడంతో పండగ కొనుగోళ్ల బడ్జెట్‌ను వినియోగదారులు మరోసారి పరిశీలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే వెంటనే అన్ని ఉత్పత్తుల ధరలు పెరిగే అవకాశం లేకపోవచ్చు. డీలర్ల వద్ద ఇప్పటికే ఉన్న పాత స్టాక్ కారణంగా కొన్ని ఉత్పత్తులు కొంతకాలం పాత ధరలకే లభించే అవకాశముంది. ముఖ్యంగా దీపావళి వరకు పాత స్టాక్‌ను విక్రయించే అవకాశం ఉండటంతో కొన్ని మోడళ్లపై ధరల పెంపు ప్రభావం ఆలస్యంగా కనిపించవచ్చు. అందువల్ల పండగ సీజన్‌లో ఏసీలు, టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషిన్లు వంటి గృహోపకరణాలు కొనుగోలు చేయాలనుకునే వినియోగదారులకు డీలర్ల వద్ద ఉన్న పాత స్టాక్, కొత్త ధరలను సరిపోల్చుకోవడం ద్వారా కొంత ప్రయోజనం పొందే అవకాశం ఉంది.

# యూపీఐ మార్కెట్‌లోకి యాపిల్ ఎంట్రీ!

భారత్‌లో డిజిటల్ చెల్లింపుల రంగంలోకి యాపిల్ అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. యాపిల్ పే సేవలను దేశంలో అందుబాటులోకి తీసుకురావాలని సంస్థ ప్రయత్నాలు చేస్తున్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. తొలిదశలో క్రెడిట్ కార్డుల ఆధారంగా 'ట్యాప్ అండ్ పే' సేవలను ప్రారంభించే అవకాశం ఉంది. ఇందులో భాగంగా తొలుత యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డులకు ఈ సదుపాయం అందుబాటులోకి రావచ్చని సమాచారం. యాపిల్ పే సేవలు అందుబాటులోకి వస్తే ఐఫోన్, యాపిల్ వాచ్ వినియోగదారులు పీఓఎస్ మెషీన్లపై నేరుగా ట్యాప్ చేసి చెల్లింపులు చేయొచ్చు. ఇందుకోసం కార్డును భౌతికంగా వినియోగించాల్సిన అవసరం ఉండదు. యాపిల్ పరికరాల్లో కార్డు వివరాలను అనుసంధానం చేసుకుని సులభంగా లావాదేవీలు పూర్తి చేసే అవకాశం ఉంటుంది. అయితే తొలిదశలో యాపిల్ పేలో యూపీఐ చెల్లింపుల




సదుపాయం ఉండకపోవచ్చని తెలుస్తోంది. ప్రస్తుతం క్రెడిట్ కార్డు ఆధారిత చెల్లింపులకే సేవలను పరిమితం చేసే అవకాశం ఉంది. భవిష్యత్తులో యూపీఐ మద్దతును కూడా తీసుకురావాలని యాపిల్ భావిస్తున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. అదే జరిగితే భారత్‌లో యాపిల్ పేకు మరింత విస్తృతమైన వినియోగదారుల వర్గం ఏర్పడే అవకాశం ఉంటుంది. దేశంలో ఇప్పటికే ఫోన్‌పే, గూగుల్ పే వంటి యూపీఐ సేవలు విస్తృతంగా వినియోగంలో ఉన్నాయి. యాపిల్ పేకు భవిష్యత్తులో యూపీఐ మద్దతు లభిస్తే ఈ సంస్థలతో పోటీ మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా ఐఫోన్, యాపిల్ వాచ్ వినియోగదారులకు యూపీఐతో పాటు ఇతర డిజిటల్ చెల్లింపు సదుపాయాలు ఒకే వేదికపై అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది. భారత్‌లో డిజిటల్ చెల్లింపుల వినియోగం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో యాపిల్ పే ప్రవేశం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే సేవల అధికారిక ప్రారంభ తేదీ, ఏయే బ్యాంకుల క్రెడిట్ కార్డులకు మద్దతు లభిస్తుంది, యూపీఐ సదుపాయం ఎప్పుడు అందుబాటులోకి వస్తుందనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

# హై జంప్‌లో 'వెండి' ధమాకా.. కాంస్యంతో మెరిసిన పరుల్, తేజస్విన్..!

: పద్దెనిమిదో ఆసియా క్రీడల్లో భారత్ అథ్లెట్లు పతకాల పంట పండిస్తున్నారు. ఎనిమిదో రోజు హై జంప్‌లో అన్సీ సోజన్ త్రుటిలో స్వర్ణం చేజార్చుకోగా, పురుషుల విభాగంలో సర్వేవ్ కుశారే (ఘుతీజవంష్త ఖబంష్ఘుతీవ) చరిత్రాత్మక వెండితో అదరగొట్టాడు. డెకథ్లాన్‌లో అంచనాలు అందుకున్న తేజస్విన్ శంకర్ కాంస్యం గెలుపొందగా.. మహిళల 3వేల మీటర్ల స్టీపుల్ ఛేజ్‌లో పరుల్ చౌదరీ అత్యుత్తమ వ్యక్తిగత ప్రదర్శనతో కంచు మోత మోగించింది.
నగోయలో జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు జోరు చూపిస్తున్నారు. మహిళల 200 మీటర్ల ఫైనల్లో హరిత భత్రా కంచు మోత మోగించిన కాసేపటికే లాంగ్ జంప్, డెకత్లాన్, స్టీపుల్ ఛేజ్‌లో పతకాలతో అదరగొట్టింది మన బృందం. మహిళల లాంగ్ జంప్ ఫైనల్లో సత్తా చాటిన అన్సీ సోజన్ అనూహ్యంగా రెండో స్థానంతో సరిపెట్టుకుంది. ఐదో ప్రయత్నంలో 6.53 మీటర్ల దూరం దూకిన తను పసిడి పక్కా అనుకుంది. కానీ, చైనా అథ్లెట్ హుయాంగ్ ఇంగింగ్ అందర్నీ ఆశ్చర్యపరుస్తూ 6.55 మీటర్ల జంప్‌తో స్వర్ణం ఎగరేసుకుపోయింది. ఇదే విభాగంలో కాంస్యంపై ఆశలు పెట్టుకున్న శైలిల్ సింగ్‌కు సైతం




చుక్కెదురైంది. 6.41 మీటర్లతో మూడో స్థానంలో నిలిచిన ఆమెను 6.46 మీటర్లతో టాన్ మంగి(జపాన్) వెనక్కి నెట్టి పతకం పట్టుకుపోయింది.

చరిత్రాత్మక సిల్వర్

పురుషుల హై జంప్‌లో సర్వేష్ కుశారే వెండి వెలుగులు విరజిమ్మాడు. ఫైనల్లో అతడు ఏకంగా 2.25 మీటర్లు జంప్ చేసి.. చరిత్రాత్మక పతకం ఒడిసిపట్టాడు. అయితే.. అతడు రెండో ప్రయత్నంలో ఈ దూరం అందుకోగా.. తొలి ప్రయత్నంలోనే ఇంత దూరం దూకిన సుహాన్ పు(చైనీస్ తైపీ) కు స్వర్ణం దక్కింది. డెకథ్లాన్‌లో తేజస్విన్ శంకర్ తనకు తిరుగులేదని చాటాడు. పది క్రీడల్లో సత్తా చాటిన అతడు చివరిదైన 1500 మీటర్ల పరుగులో అగ్రస్థానం సాధించాడు. కానీ, 7,934 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచిన అతడు దేశానికి కాంస్యం అందించాడు. ఇక మహిళల 3000 మీటర్ల స్టీపుల్ ఛేజ్‌లో పరుల్ చౌదరి అంచనాలు నిలబెట్టుకుంది. 9:08.67 సెకన్ల టైమింగ్‌తో లక్ష్యాన్ని పూర్తి చేసి తను కాంస్యంతో మురిసింది. ఇదే విభాగంలో భారత అథ్లెట్ అంకిత నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది.

# ఒక్కరోజులో మూడు మ్యాచ్‌లా?..

### ఆసియా క్రీడల నిర్వాహకులపై సింధు ఫైర్..!

ఆసియా క్రీడల్లో పతకం గెలవాలనుకున్న పీవీ సింధు కల చెదిరింది. క్వార్టర్ ఫైనల్లో ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించిందీ తెలుగు తేజం. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో చెన్ యుఫీ(చైనా) చేతిలో కంగుతిన్న సింధు నిర్వాహకులపై మండిపడింది. ఒక్కరోజులో మూడు మ్యాచ్‌లు ఏంటీ? అసలు ఇదేం షెడ్యూల్? అంటూ ఫైర్ అయిందీ ఒలింపిక్ విజేత. అంతేకాదు కోర్టులో రివ్యూ కెమెరాలు లేకపోవడాన్ని కూడా సింధు తప్పుపట్టింది. జపాన్‌లోని ఐచీ నగోయలో జరుగుతున్న 18వ ఆసియా క్రీడల్లో పీవీ సింధు పోరాటం ముగిసింది. మహిళల సింగిల్స్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన సింధు క్వార్టర్ ఫైనల్లోనే వెనుదిరిగింది. ఆదివారం చైనా షట్లర్ చెన్ యుఫీపై 21-11తో తొలి సెట్ గెలుపొందిన సింధు ఆ తర్వాత తడబడింది. నాలుగో సీడ్ ధాటికి వరసగా రెండు సెట్లను 18-21, 10-21తో కోల్పోయిన తెలుగుతేజం టోర్నీ నుంచి



వైదొలిగింది. అయితే.. బిజీ షెడ్యూల్ కారణంగా సరిపోను మ్యాచ్ సన్నద్ధత లేకపోవడం వల్లనే తాను ఓటమి పాలయ్యానని సింధు వాపోయింది. భారత స్టార్ ఒక్క రోజులనే మూడు మ్యాచ్‌లు ఆడింది. శనివారం ఉదయం 12:07 గంటలకు రెండో మ్యాచ్ ఆడిన తను.. ఆదివారం చెన్ యుఫీతో క్వార్టర్ ఫైనల్ కోసం కోర్టుకు వచ్చేసింది. దాంతో.. తీరిక లేకుండా ఆడడం, నిద్ర లేకపోవడానికి తోడు సరైన నిర్వహణ లోపించడం కారణంగా పతకం చేజారిందని సింధు తెలిపింది.

## స్పోర్ట్స్

### హైజంప్‌లో వెండి ధమాకా.. కాంస్యంతో మెరిసిన పరుల్, తేజస్విన్!



పద్దెనిమిదో ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు పతకాల పంట పండిస్తున్నారు. ఎనిమిదో రోజు అథ్లెటిక్స్‌లో భారత్‌కు పలు పతకాలు దక్కాయి. మహిళల లాంగ్‌జంప్‌లో అన్సీ సోజన్ త్రుటిలో స్వర్ణాన్ని చేజార్చుకుని రజతంతో సరిపెట్టుకోగా.. పురుషుల హైజంప్‌లో సర్వేష్ కుశారే చారిత్రాత్మక వెండి పతకంతో మెరిశాడు. డెకథ్లాన్‌లో తేజస్విన్ శంకర్ కాంస్యం సాధించగా.. మహిళల 3,000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో పరుల్ చౌదరీ అత్యుత్తమ వ్యక్తిగత ప్రదర్శనతో కాంస్య పతకం సొంతం చేసుకుంది. నగోయాలో జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు వరుసగా పతకాలు సాధిస్తూ సత్తా చాటుతున్నారు. మహిళల 200 మీటర్లలో హరిత భత్రా కాంస్యం సాధించిన కొద్దిసేపటికే లాంగ్‌జంప్, డెకథ్లాన్, స్టీపుల్‌చేజ్ విభాగాల్లోనూ భారత క్రీడాకారులు పతకాలు కొల్లగొట్టారు. మహిళల లాంగ్‌జంప్ ఫైనల్లో అన్సీ సోజన్ అద్భుత ప్రదర్శన చేసింది. ఐదో ప్రయత్నంలో 6.53 మీటర్ల దూరం దూకిన ఆమె స్వర్ణం సాధించేలా కనిపించింది. అయితే చివరి దశలో చైనా అథ్లెట్ హుయాంగ్ ఇంగింగ్ అద్భుతంగా పుంజుకుంది. 6.55 మీటర్ల దూరం దూకి అన్సీని వెనక్కి నెట్టి స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. దీంతో అన్సీ సోజన్ రజతంతో సరిపెట్టుకుంది. ఇదే విభాగంలో భారత్‌కు మరో పతకం దక్కుతుందని భావించిన శైలీ సింగ్‌కు నిరాశ ఎదురైంది. ఆమె 6.41 మీటర్ల దూరంతో మూడో స్థానంలో నిలిచింది. అయితే జపాన్ అథ్లెట్ టాన్ మంగీ 6.46 మీటర్లతో శైలీని అధిగమించి కాంస్య పతకాన్ని దక్కించుకుంది. పురుషుల హైజంప్‌లో సర్వేష్ కుశారే భారత్‌కు చారిత్రాత్మక రజత పతకాన్ని అందించాడు. ఫైనల్లో 2.25 మీటర్ల ఎత్తును అధిగమించిన అతడు రెండో ప్రయత్నంలో ఈ ఘనత సాధించాడు. దీంతో హైజంప్‌లో భారత్‌కు విలువైన రజతం దక్కింది. చైనీస్ తైపీకి చెందిన సుహాన్ పు తొలి ప్రయత్నంలోనే 2.25 మీటర్ల ఎత్తును అధిగమించడంతో స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకున్నాడు. డెకథ్లాన్‌లో తేజస్విన్ శంకర్ అంచనాలకు తగ్గట్టుగా రాణించాడు. పది విభాగాల్లోనూ సత్తా చాటిన అతడు చివరి ఈవెంట్ అయిన 1,500 మీటర్ల పరుగులో అగ్రస్థానంలో నిలిచాడు. మొత్తం 7,934 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించాడు. దీంతో భారత ఖాతాలో మరో అథ్లెటిక్స్ పతకం చేరింది. మహిళల 3,000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో పరుల్ చౌదరీ కూడా సత్తా చాటింది. 9:08.67 సెకన్లలో రేసును పూర్తి చేసిన ఆమె కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ ప్రదర్శనతో తన అత్యుత్తమ వ్యక్తిగత రికార్డును నమోదు చేసింది. ఇదే విభాగంలో మరో భారత అథ్లెట్ అంకిత నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. ఎనిమిదో రోజు అథ్లెటిక్స్‌లో వరుసగా పతకాలు సాధించడంతో భారత బృందంలో ఉత్సాహం నెలకొంది. ముఖ్యంగా సర్వేష్ కుశారే రజతం, తేజస్విన్ శంకర్, పరుల్ చౌదరీ కాంస్య పతకాలతో భారత అథ్లెటిక్స్ బృందం సత్తా చాటింది.




# నాని 'ది ప్యారడైజ్' మరో రికార్డు!

## మూడు రోజుల్లో రూ.136 కోట్లు..




నేచురల్ స్టార్ నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన 'ది ప్యారడైజ్' సినిమా ప్రస్తుతం థియేటర్లలో సందడి చేస్తోంది. విడుదలైన మొదటి రోజు నుంచే భారీ వసూళ్లను రాబడుతున్న ఈ చిత్రం.. తాజాగా మరో కీలక మైలురాయిని అందుకుంది. ఇప్పటికే నాని కెరీర్‌లో వేగంగా రూ.100 కోట్ల గ్రాస్ మార్క్‌ను దాటిన సినిమాగా నిలిచిన 'ది ప్యారడైజ్'.. మూడు రోజుల్లోనే రూ.136 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించినట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. సినిమా మూడు రోజుల బాక్సాఫీస్ వసూళ్లకు సంబంధించిన వివరాలను మేకర్స్ తాజాగా పోస్టర్ ద్వారా వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా మూడు రోజుల్లో ఈ చిత్రం రూ.136 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు ప్రకటించారు. మూడో రోజు సుమారు రూ.22 కోట్ల గ్రాస్ వసూళ్లు వచ్చినట్లు ఈ లెక్కల ద్వారా తెలుస్తోంది.రెండో రోజుతో పోలిస్తే మూడో రోజు వసూళ్లలో కొంత తగ్గుదల కనిపించినప్పటికీ.. అది పెద్దగా ప్రభావం చూపలేదని ట్రేడ్ వర్గాల అంచనా. ముఖ్యంగా వారాంతపు రోజుల్లో సినిమాకు వస్తున్న స్పందనతో వసూళ్లు స్థిరంగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఆదివారం కూడా మూడో రోజు స్థాయిలోనే వసూళ్లు నమోదయ్యే అవకాశం ఉందని అంచనాలు ఉన్నాయి. అదే జరిగితే సినిమా త్వరలోనే రూ.150 కోట్ల గ్రాస్ మార్క్‌కు చేరువయ్యే అవకాశముంది. మరోవైపు నాలుగో రోజు గంటల వారీగా నమోదవుతున్న బుకింగ్స్ కూడా ఆశాజనకంగా ఉన్నట్లు సమాచారం. దీంతో ఇప్పుడు అందరి దృష్టి సోమవారం నుంచి మొదలయ్యే ఎంత వసూళ్లు రాబడుతుంది అనే దానిపై ఉంది. వారాంతపు జోరును కొనసాగిస్తూ సినిమా స్థిరమైన వసూళ్లను సాధిస్తుందా? లేక వసూళ్లలో గణనీయమైన డ్రాప్ కనిపిస్తుందా? అనేది రాబోయే రోజుల్లో తేలనుంది. ది ప్యారడైజ్' చిత్రానికి శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించారు. నాని సరసన కాయదు లోహర్ నటించగా.. మంచు మోహన్ బాబు, సోనాలి కులకర్ణి, రాఘవ్ జుయల్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు. తెలంగాణ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో యాక్షన్‌తో పాటు సామాజిక అంశాలను కూడా దర్శకుడు కథలో భాగంగా చూపించినట్లు తెలుస్తోంది. భారీ బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రాన్ని సుధాకర్ చెరుకూరి నిర్మించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. విడుదలకు ముందు నుంచే భారీ అంచనాలు నెలకొన్న ఈ సినిమా.. ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద కొనసాగుతున్న వసూళ్లతో నాని కెరీర్‌లో మరో ముఖ్యమైన చిత్రంగా నిలుస్తోంది

# వారితో ప్రయాణం ప్రమాదకరం

'బంధాలకు పునాది నమ్మకమే. ఆ నమ్మకం ఒక్కసారి ఒమ్మయితే, పరిస్థితుల్ని మళ్లీ పూర్వస్థితికి తీసుకురావడం అసాధ్యం' అంటున్నది అందాలభామ కాజల్ అగర్వాల్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మానవ సంబంధాలు, మానసిక ప్రశాంతతలపై ఆసక్తికరంగా మాట్లాడింది కాజల్. 'ప్రేమ, స్నేహం, కుటుంబం, వృత్తి.. ఇలా ఎక్కడైనా సరే.. నమ్మకద్రోహానికి ఒడిగట్టే వ్యక్తులకు జీవితంలో స్థానం ఇవ్వకూడదు.స్వార్థపూరిత ఆలోచనలతో నమ్మకాన్ని తుంగలో తొక్కే వారితో కలిసి ప్రయాణించడం అత్యంత ప్రమాదకరం. పైకి నవ్వుతూ, లోపల స్వార్థాన్ని దాచుకునే వారిని గుర్తించి, వారికి దూరంగా ఉండటమే శ్రీరామరక్ష. అవసరాల కోసం స్నేహాన్నీ, సంబంధాలనూ వాడుకునే స్వార్థపరులు ప్రతి రంగంలోనూ ఉంటారు' అని కాజల్ వ్యాఖ్యానించింది. ఈ మాటలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



# సినిమాలు మానేసి హిమాలయాలకు వెళ్లిపోదామనుకున్నా..

### నివేదా పేతురాజ్ సంచలన విషయాలు

'మెంటల్ మది' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన నటి నివేదా పేతురాజ్ తన అందం, నటనతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించి మెప్పించిన ఆమె.. ఓ దశలో సినిమాలకు పూర్తిగా దూరమవ్వాలని కూడా నిర్ణయించుకున్నారట. కొన్ని వ్యక్తిగత పరిస్థితులు, తీసుకున్న నిర్ణయాల కారణంగా తీవ్ర ఒత్తిడికి గురైన నివేదా.. ఏకంగా హిమాలయాలకు వెళ్లి ధ్యానం చేసుకుంటూ జీవించాలని అనుకున్నానని తాజాగా వెల్లడించారు. ప్రస్తుతం మాత్రం మళ్లీ వరుస అవకాశాలతో నటిగా బిజీ అవుతున్నారు. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం'లో ఆమె కీలక పాత్రలో నటిస్తున్నారు.కొన్నేళ్ల క్రితం తన రూపంలో మార్పులు చేసుకోవాలనే ఆలోచన తనకు వచ్చిందని నివేదా తెలిపారు. ముఖ్యంగా పెదవుల ఆకారం కోసం శస్త్రచికిత్స చేయించుకోవాలని అనుకున్నారట. ఈ విషయంపై తన వ్యక్తిగత వైద్యుడిని సంప్రదించగా.. ఆయన తీవ్రంగా మందలించడంతో పాటు భవిష్యత్తులో ఎదురయ్యే ఆరోగ్య సమస్యల గురించి వివరించారని చెప్పారు. దీంతో ఆ ఆలోచనను విరమించుకున్నట్లు తెలిపారు. సాయి పల్లవి, నిత్యామీనన్ వంటి నటీమణులు ఎలాంటి శస్త్రచికిత్సలు చేయించుకోకుండానే, తమ సహజ రూపంతోనే ప్రేక్షకుల ఆదరణ పొందుతున్నారని గుర్తుచేసుకున్నారు. వాళ్లను చూసిన తర్వాత తనకు కూడా తన రూపం గురించి అనవసరంగా ఎందుకు ఆలోచిస్తున్నాననే విషయం అర్థమైందని నివేదా పేర్కొన్నారు. తనకు ఒక విచిత్రమైన అనుభవం ఉందని నివేదా చెప్పారు. తాను మనసులో ఏదైనా ప్రతికూలంగా ఊహించుకుంటే అది నిజమైపోతుందనే భావన కలిగేదని తెలిపారు. తన వ్యక్తిగత జీవితంలోనూ అలాంటి సంఘటన ఎదురైందని చెప్పారు. తన మాజీ ప్రియుడు తనను ఎవరి కోసం వదిలి వెళ్లొచ్చనే విషయాన్ని ముందే ఊహించానని, చివరకు అదే జరిగిందని వెల్లడించారు. ఆ తర్వాత నుంచి ఏ విషయాన్నీ ముందుగానే ఊహించకుండా ఉండేందుకు ప్రయత్నిస్తున్నానని చెప్పారు. అయితే మనసులో ఆలోచనలు రావడం సహజమే కదా అంటూ తన అనుభవాన్ని పంచుకున్నారు., 2023లో సినిమాలు మానేయాలని నిర్ణయించుకున్నానని నివేదా తెలిపారు. ఆ సమయంలో కొన్ని తప్పుడు నిర్ణయాలు తీసుకున్నానని, దాని ప్రభావంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యానని చెప్పారు. డిప్రెషన్‌తో పాటు పానిక్ అటాక్స్ కూడా ఎదురయ్యాయని వెల్లడించారు. ఆ పరిస్థితుల నుంచి బయటపడటానికి చాలా కష్టపడ్డానని చెప్పిన నివేదా.. మళ్లీ సినిమా అవకాశాలు రాకపోతే హిమాలయాలకు వెళ్లి ధ్యానం చేసుకుంటూ జీవించాలని కూడా నిర్ణయించుకున్నానని తెలిపారు. అయితే పరిస్థితులు మారడంతో మళ్లీ నటనపై దృష్టి పెట్టానని చెప్పారు



# చీరకట్టులో మలబారు సోయగం మాళవిక మోహనన్.. స్టిల్స్ వైరల్



తెలుగులో సూపర్ ఫ్యాన్ బేస్ ఉన్న మాలీవుడ్ భామల్లో టాప్‌లో ఉంటుంది మాళవిక మోహనన్ . నెట్టింట ఈ భామ ఫొటోలు షేర్ చేసిందంటే క్రేజ్ ఎలా ఉంటుందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. మోడ్రన్ డ్రెస్సుల్లో హాట్ హాట్ లుక్స్‌లో సందడి చేస్తూ కుర్రకారు గుండెలను పిండేసే ఈ ముద్దుగుమ్మ తాజాగా ట్రెడిషనల్ లుక్‌లో కనిపించి ఔరా అనిపిస్తుంది. మోడ్రన్ లుక్‌లోనైనా సంప్రదాయక చీర కట్టులోనైనా అందంలో డామినేట్ చేయాలంటే నా తర్వాతే ఎవరైనా అంటూ చెప్పకనే చెబుతోంది.తాజాగా మాళవిక మోహనన్ చీరకట్టులో దర్శనమిచ్చింది. సాఫ్ట్ పింక్ ఎంబ్రాయిడరీ శారీలో జుంకాలతో హొయలుపోతూ కెమెరాకు ఫోజులిచ్చింది. చూసేందుకు రెండు కండ్లు చాలవా అన్నట్టుగా ఉన్న మలబారు సోయగం స్టిల్స్ సోషల్ మీడియాలో రౌండప్ చేస్తున్నాయి. ఈ భామ నటించిన రాజాసాబ్, సర్దార్ 2 సినిమాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టి తీవ్ర నిరాశనే మిగిల్చాయి.

# లేడీ ప్రభాస్ అంటుంటారు..



'కేజీఎఫ్' వేదికగా సినీరంగ ప్రవేశం చేసిన కన్నడ బ్యూటీ శ్రీనిధిశెట్టి. మొదటి సినిమాతోనే మంచి ఫేమ్ సంపాదించుకొని.. కన్నడ, తమిళ భాషల్లో వరుసగా సినిమాలు చేసింది. హిట్ 3, తెలుసుకదా సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. తాజాగా 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47'లో విక్టరీ వెంకటేశ్‌తో జతకట్టింది. ఈ చిత్రం త్వరలో విడుదల కానున్న సందర్భంగా శ్రీనిధి పంచుకున్న కార్‌వాన్ కబుర్లివి...చదువుతోపాటు డ్యాన్స్, వాలీబాల్, త్రో బాల్, స్విమ్మింగ్ క్రీడల్లో ముందుండేదాన్ని. డాక్టర్ అవ్వాలన్నది నా కల. కానీ, ఇంజినీరింగ్ చదివి, ఉద్యోగం చేశా. నటనపై ఆసక్తితో మాడల్‌గా కెరీర్ ప్రారంభించా. ఇండస్ట్రీలో ఒకప్పుడు పెండ్లయిన నటీమణులు మాత్రమే తల్లి పాత్రలు వేస్తుండేవారు. కానీ, ప్రస్తుతం ట్రెండ్ మారింది. సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో ఐశ్వర్య రాజేష్... తల్లి పాత్రలో ఒదిగిపోయింది. మనకు ఇచ్చిన పాత్రకు న్యాయం చేయడమే నాకు తెలిసిన యాక్టింగ్. చాలామంది నెటిజన్లు అంతపెద్ద పాత్ర ఇంత చిన్న వయసులో చేయొద్దని కామెంట్లు పెట్టారు. సినిమా చూసిన తరువాత మీ అభిప్రాయం మార్చుకుంటారని భావిస్తున్నా.మనసుకు ప్రశాంతతనిచ్చే పనులు చేస్తా. అందుకే గత శివరాత్రికి ఈషా ఫౌండేషన్ వేడుకలకు హాజరయ్యా. ఆ రోజంతా శివుడి ధ్యానంలోనే గడిపా. ఎంతో ఊరట చెందా! సామాజిక మాధ్యమాల్లో అంతగా కాలక్షేపం చేయలేను. హీరో ప్రభాస్ కూడా ఎక్కువ వాడడని విన్నాను. చాలాసార్లు నేను లేడీ ప్రభాస్‌నని మా స్నేహితులంతా పిలుస్తుంటారు. అది కూడా మన మంచికే కదా అని నవ్వి ఊరుకుంటాను. రామాయణ చిత్రంలో వచ్చిన అవకాశాన్ని వదులుకున్నానని కొందరు ట్రోల్ చేస్తున్నారు. అది అబద్ధం. సీత పాత్ర కోసం నేను ఆడిషన్ ఇచ్చిన మాట వాస్తవమే! కానీ, ఆ పాత్రకు నన్ను ఎంపిక చేయలేదు. సీతమ్మ పాత్రలో నటించే అవకాశం వస్తే ఎందుకు వదులుకుంటాను చెప్పండి.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10, Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465